ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -35 పేజీలు - 08 వెల - 04/- శనివారం 24 జనవరి 2026

# అన్నివర్గాలకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలి




## రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో సిఎం చంద్రబాబు

**ప్రైవేట్ వ్యక్తుల జోలికి వెళ్లకుండా చూడాలి**

**చిన్నతరహా పరిశ్రమలు, డ్వాక్రాలకు రుణాలు అందాలి**

**రుణాల రీ షెడ్యూల్ అవకాశాన్ని వినియోగించుకోవాలి**

**ప్రకృతి సేద్యం చేసే వారికి విరివిగా రుణాలు ఇవ్వండి**

**బ్యాంకర్ల స్థాయి మీటింగ్‌లో కలెక్టర్లను కూడా ఆహ్వానించాలి**

అమరావతి, **జనవరి 23ఆంధ్ర ప్రగతి**
రుణాల రీషెడ్యూల్‌తో రూ.1,108 కోట్ల మేర ఆదా చేయగలిగామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. ఎంఎస్ఎంఈలు, వివిధ కీలక రంగాలు అభివృద్ధి జరిగేలా బ్యాంకర్ల సహకారం అందించాలని కోరారు. వ్యాపారాల్లో బలహీనవర్గాలకు చేయూతనిచ్చే ఎంఎస్ఎంఈలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అమరావతిలో బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు. ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వం, బ్యాంకర్లే వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరముంది. వాటి పోత్సాహంతో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుంది. వైకాపా పాలనలో వ్యవస్థలు గాడి తప్పి ప్రభుత్వానికి క్రెడిబులిటీ పోయింది. పెద్ద ఎత్తున వడ్డీలకు అప్పులు తెచ్చారు. క్రెడిబులిటీ ఉంటే తక్కువ వడ్డీలకు రుణాల తీసుకురావొచ్చు. రాష్ట్రంలో 2 లక్షల కోట్ల మేర రుణాలను రీషెడ్యూల్ చేసుకునే అవకాశం ఉందని అంచనా వేశామని అన్నారు. ఇప్పటి వరకు రూ.49వేలకోట్లు రీషెడ్యూల్ చేశాం. ప్రకృతి సేద్యం మరింత విస్తరించేందుకు బ్యాంకర్ల నుంచి ప్రోత్సాహం అందాలి. మిగతా 2లో...




# కేరళలో కొత్త రైళ్లకు ప్రధాని మోదీ పచ్చజెండా..

## తెలుగు రాష్ట్రాలకు మరో సర్వీస్

**కేరళలో మూడు అమృత్ భారత్, ఒక ప్యాసింజర్ రైలును ప్రారంభించిన ప్రధాని**

**తిరువనంతపురం నుంచి తెలంగాణలోని చర్లపల్లికి కొత్త అమృత్ భారత్ సర్వీసు**

**నాన్-ఏసీ కోచ్‌లలోనూ సీసీటీవీ, చార్జింగ్ సాకెట్ల వంటి మెరుగైన సౌకర్యాలు**

**సామాన్యులకు తక్కువ ధరలో సౌకర్యవంతమైన ప్రయాణం లక్ష్యంగా ఈ రైళ్లు**

# సరస్వతీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**బాసర, వర్గల్‌లో జోరుగా**

**అక్షరాభ్యాసాలు**

**ప్రత్యేక పూజలు చేపట్టిన భక్తులు**

నిర్మల్, **జనవరి 23ఆంధ్ర ప్రగతి**
దేశవ్యాప్తంగా వసంత పంచమి వేడుకలను భక్తులు ఉత్సాహంగా జరుపుకున్నారు. విద్య, జ్ఞానం, వాక్చాతుర్యానికి దేవతగా పరిగణించే సరస్వతి దేవికి అంకితం చేయబడింది. జ్ఞానం, విద్య, కళలలో విజయం కోరుతూ ప్రజలు సరస్వతి దేవిని పూజిస్తారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సృజనాత్మక రంగాలలో ఉన్నవారికి చాలా ముఖ్యమైనది. మారుతున్న ఋతువుల ప్రారంభం, వసంతకాలం ఆగమనాన్ని సూచిస్తుంది. వసంత పంచమి నాడు సరస్వతి దేవిని భక్తగా పూజించడం వల్ల చదువుపై దృష్టి పెట్టడానికి, జీవితంలో సానుకూల మార్పులు వస్తాయని నమ్ముతారు. దీంతో పలు ఆలయాల్లో ముఖ్యంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణలోని బాసర,వర్గల్, ఓయూ క్యాంపస్ తదితర సరస్వతీ ఆలయాల్లో విద్యార్థుల సందడి కనిపించింది. అక్షరాభ్యాసాలకు చిన్నారులు తరలివచ్చారు. మిగతా 2లో...



# సీమకు నీటి తరలింపులో సరి కొత్త రికార్డ్

**చరిత్రలో 40.109 టీఎంసీల నీటి తరలింపు**

**కేవలం 190 రోజుల్లో నీటి తరలింపు**

**సీమను సస్యశ్యామలం చేసినందుకు సీఎంకు సీమ మంత్రుల కృతజ్ఞతలు**



**అమరావతి జనవరి 23ఆంధ్ర ప్రగతి**
హంద్రీ-నీవా ప్రాజెక్టును రికార్డ్ స్థాయిలో నీటిని సీమ జిల్లాలకు తరలించి రికార్డ్ సృష్టించింది ఏపీ జలవనరుల శాఖ. హంద్రీ-నీవా ప్రాజెక్టు నుంచి తొలిసారిగా 40.109 టీఎంసీల నీటిని ఇరిగేషన్ అధికారులు డ్రా చేశారు. ప్రాజెక్ట్ డిజైన్డ్ కెపాసిటీని మించి ఈ స్థాయిలో నీటిని తరలించడం ఇదే తొలిసారి. రికార్డు స్థాయిలో నీటిని తరలించడమే కాకుండా..

# అనధికార లే ఔట్ల రెగ్యులేషన్ గడువు పొడిగింపు

## ప్రభుత్వం ప్రకటన విడుదల




# ముగిసిన మిథున్ రెడ్డి ఈడీ విచారణ..

**మీడియాతో మాట్లాడేందుకు నిరాకరణ**

**హైదరాబాద్‌లో 7 గంటల పాటు ప్రశ్నించిన ఈడీ**

**కోర్టు ఆదేశాల వల్ల వివరాలు వెల్లడించలేనని స్పష్టం చేసిన ఎంపీ**

**హైదరాబాద్ జనవరి 23ఆంధ్ర ప్రగతి**
ఏపీ మద్యం కుంభకోణం (ఏపీ లిక్కర్ స్కామ్) కేసులో దర్యాప్తు మరింత వేగవంతమైంది. ఈ కేసులో భాగంగా వైసీపీ రాజంపేట ఎంపీ పి.వి. మిథున్ రెడ్డి శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని ఈడీ జోనల్ కార్యాలయంలో ఆయనను అధికారులు సుమారు ఏడు గంటల పాటు సుదీర్ఘంగా ప్రశ్నించి, కీలక వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు.
మిగతా 2లో...



# మంత్రి లోకేశ్ దావోస్ పర్యటన విజయవంతం

**ఆర్ఎంజెడ్ సంస్థతో సుమారు రూ. లక్ష కోట్ల పెట్టుబడి ఒప్పందం ఖరారు**

**ఈ ఒప్పందంతో రాష్ట్రంలో దాదాపు లక్ష ఉద్యోగాల కల్పనకు అవకాశం**

**విశాఖ, రాయలసీమలో భారీ ప్రాజెక్టుల ఏర్పాటుకు మార్గం సుగమం**

**పలు దిగ్గజ సంస్థలతో 45 కీలక సమావేశాల్లో పాల్గొన్న మంత్రి లోకేశ్**




**జనవరి 23ఆంధ్ర ప్రగతి**
స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో పాల్గొన్న రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన పర్యటనను విజయవంతంగా ముగించుకుని స్వదేశానికి తిరుగుపయనమయ్యారు. నాలుగు రోజుల పాటు సాగిన ఈ పర్యటనలో ఆంధ్రప్రదేశ్‌కు భారీగా పెట్టుబడులను ఆకర్షించడంలో లోకేశ్ బృందం సఫలీకృతమైంది. మిగతా 2లో...

# అమెరికా మరో సంచలన నిర్ణయం

## డబ్ల్యూహెచ్‌వోనుంచి వైదులుగుతున్నట్లు ప్రకటన

వాషింగ్టన్ **జనవరి 23ఆంధ్ర ప్రగతి**
అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. అనేక విషయాల్లో దూకుడుగా వ్యవహరిస్తున్న ట్రంప్ సర్కార్ ఇప్పుడు ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్‌వోనుంచి అధికారికంగా వైదొలిగింది.రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలు సందర్భాల్లో ఆ సంస్థ నుంచి వైదొలుగుతామని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా అగ్రరాజ్యం తన నిర్ణయాన్ని ప్రకటించడం గమనార్హం. మిగతా 2లో...




# ఏడు గంటలు కేటీఆర్ విచారణ

**కోట్ల రూపాయల ఎలక్టోరల్ బాండ్లు, ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ ఆరా**

**కొన్నింటికి మాజీమంత్రి ఎదురు ప్రశ్నలు**

**జూబ్లీహిల్స్ వద్ద బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన**

**హైదరాబాద్ జనవరి 23ఆంధ్ర ప్రగతి**
రాష్ట్రంలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్‌ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఏడు గంటలకు పైగా సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. ప్రధానంగా ఎలక్టోరల్ బాండ్ల ద్వారా కోట్లాది రూపాయలు సేకరించడం, ప్రముఖుల ఫోన్ ట్యాపింగ్మిగతా 2లో...





## సరస్వతీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

(మొదటి పేజీ తరువాయి)

నిర్మల్ జిల్లాలోని బాసర శ్రీ జ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాసర పుణ్యక్షేత్రం. భక్తుల తో కిక్కిరిసిపోయింది. వసంత పంచమి సందర్భంగా అమ్మవార్ల కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునుంచే ప్రత్యేక అక్షరాభ్యాసం, కుంకుమార్చన పూజలు మొదలయ్యాయి. వేకువ జామునుంచే భక్తుల రద్దీ కొనసాగుతోంది. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్ధరాత్రి నుంచి చదువుల తల్లి దర్శనం కోసం భక్తులు వేచి ఉన్నారు. చిన్నారుల అక్షర శ్రీకార పూజలు.. గోదావరి నదిలో భక్తుల పుణ్య స్నానాలు కొనసాగాయి. వసంత పంచమిని పిల్లలకు పాఠశాల విద్య ప్రారంభించడానికి శుభప్రదంగా భావిస్తారు. ఈ రోజున చిన్న పిల్లలకు మొదటిసారి రాయడం నేర్పించడం లేదా విద్యకు సంబంధించిన ఏదైనా కొత్త అడుగు వేయడం శుభప్రదంగా భావిస్తారు. ఈ రోజున పేద పిల్లలకు పుస్తకాలు, నోట్‌బుక్‌లు లేదా పెన్నులు దానం చేయడం కూడా పుణ్యప్రదంగా పరిగణిస్తారు. ఈ క్రమంలో అమ్మవారి ఆలయంలో పెద్ద ఎత్తున అక్షరాభ్యాసాలు సాగాయి.

## సీమకు నీటి తరలింపులో సరి కొత్త రికార్డ్

(మొదటి పేజీ తరువాయి)

. కేవలం 190 రోజుల్లోనే ఈ స్థాయిలో నీటిని ఇరిగేషన్ అధికారులు రాయలసీమకు తరలించారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయినప్పటి నుంచి ఈ స్థాయిలో నీటి తరలింపు తొలిసారిగా జరగడంతో సీమ జిల్లాల రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రాయలసీమ జిల్లాలకు చెందిన మంత్రులు పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్ రెడ్డి, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం సీమ రైతులు నీటిని అందుకోగలగడానికి కారణం టీడీపీ, కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబేనని మంత్రులు వ్యాఖ్యానించారు. గతంలో 1 పంపు నుంచి మాత్రమే నీటిని డ్రా చేసుకునే పరిస్థితి ఉండేదని కానీ ప్రస్తుతం 6 పంపులను వినియోగించేలా సామర్థ్యం పెంచి హంద్రీ-నీవా పనులను నాడు చేపట్టారని మంత్రి పయ్యావుల గుర్తు చేశారు. ఇక ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 6 పంపుల సామర్థ్యాన్ని 12 పంపుల వరకు పెంచిందని మంత్రి కేశవ్ సీఎంకు గుర్తు చేశారు. అలాగే 100 రోజుల్లో హంద్రీ-నీవా కాల్వల వెడల్పు పనులను పూర్తి చేశామని..ఇది కూడా ఓ రికార్డేనని మరో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రస్తావించారు. హంద్రీ-నీవా ప్రాజెక్టులో భాగమైన మచ్చుమర్రి ప్రాజెక్టు ఓ మేలి మలుపు అని... దాని నిర్మాణం వల్లే రాయలసీమకు నీరందించే విషయంలో సత్ఫలితాలు సాధించగలుగుతున్నామని ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. నాడు మచ్చుమర్రి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం ద్వారా సీమ ప్రజలకు ఈ స్థాయిలో నీటిని అందించేందుకు అవకాశం కలిగిందని రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు చెప్పారు. ఈ పనులను సీఎం చంద్రబాబు నిరంతర పర్యవేక్షణలో చేపట్టడంతో పాటు పక్కా ప్రణాళికను రూపొందించారని మంత్రులు ప్రస్తావించారు. ప్రస్తుతం హంద్రీ-నీవా నుంచి నీటిని డ్రా చేసే విషయంలో రికార్డ్ సృష్టించామని దీంతో పాటు మరో రికార్డ్ కూడా సృష్టించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఇక్కడితో ఆగకూడదని... 50 టీఎంసీల వరకు నీటిని హంద్రీ-నీవా ద్వారా సీమ జిల్లాలకు తరలించాలని మంత్రి నిమ్మల రామానాయుడును సీఎం ఆదేశించారు. దీంతో పాటు రాయలసీమ ప్రాంతంలోని రిజర్వాయర్లు, చెరువులను నీటితో నింపాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అన్ని చెరువులు, రిజర్వాయర్లు నిండినప్పుడే తనకు సంతోషమని సీఎం చంద్రబాబు చెప్పారు. ఫిబ్రవరి నెలాఖరు లేదా మార్చి నెల మొదటి వారంలోగా అదనంగా మరో 10 టీఎంసీలను తరలించి మొత్తంగా 50 టీఎంసీల నీటిని తరలించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్యమంత్రికి తెలియచేశారు.

## ముగిసిన మిథున్ రెడ్డి ఈడీ విచారణ..

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని ఈడీ జోనల్ కార్యాలయంలో ఆయనను అధికారులు సుమారు ఏడు గంటల పాటు సుదీర్ఘంగా ప్రశ్నించి, కీలక వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో (2019-2024) మద్యం విధానంలో చోటుచేసుకున్న అక్రమాలు, నిధుల మళ్లింపు ఆరోపణలపై ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గతంలోనే మిథున్ రెడ్డికి సమన్లు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆయన ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. మద్యం విధాన రూపకల్పన, డిస్టిలరీలతో సంబంధాలు, నిధుల లావాదేవీల వంటి పలు కీలక అంశాలపై అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలుస్తోంది.విచారణ ముగిసిన అనంతరం బయటకు వచ్చిన మిథున్ రెడ్డి మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు. ఈ కేసుకు సంబంధించి కోర్టు ఆదేశాలు ఉన్నందున తాను ఎలాంటి వివరాలు వెల్లడించలేనని స్పష్టం చేసి, అక్కడి నుంచి నేరుగా తన నివాసానికి వెళ్లిపోయారు. గతంలో ఏపీ పోలీస్ సిట్ (సిట్) ఇదే కేసులో మిథున్ రెడ్డిని ఏ5 నిందితుడిగా చేర్చి అరెస్టు చేసింది. ప్రస్తుతం ఆయన బెయిల్‌పై ఉన్నారు.సఈ కేసులో రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డిని గురువారం దాదాపు ఏడు గంటల పాటు విచారించిన మరుసటి రోజే మిథున్ రెడ్డిని విచారించడం ప్రాధాన్యత సంతరించుకుంది. విజయసాయి రెడ్డి వాంగ్మూలం ఆధారంగా లభించిన సమాచారంతోనే ఈడీ దర్యాప్తును ముందుకు తీసుకెళుతున్నట్లు తెలుస్తోంది. ఈ వరుస విచారణలతో కేసులో మరిన్ని కీలక వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, మరికొందరు ప్రముఖులకు కూడా సమన్లు జారీ చేసే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి.

## మంత్రి లోకేశ్ దావోస్ పర్యటన విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

ఈ పర్యటనలో అతిపెద్ద విజయంగా ఆర్ఎంజెడ్ కార్పొరేషన్‌తో కుదిరిన ఒప్పందం నిలిచింది. దీని ద్వారా రానున్న ఐదారు సంవత్సరాల్లో రాష్ట్రంలో సుమారు 10 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 91,000 కోట్లు) పెట్టుబడి పెట్టేందుకు ఆ సంస్థ ముందుకొచ్చింది. ఈ పెట్టుబడులతో విశాఖపట్నంలోని కాపులుప్పాడలో భారీ ఐటీ పార్క్, డేటా సెంటర్‌తో పాటు రాయలసీమలోని టేకులోడులో ఇండస్ట్రియల్, లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో దాదాపు లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.తన పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్ మొత్తం 45 కీలక సమావేశాల్లో పాల్గొన్నారు. ఆర్ఎంజెడ్ తో పాటు బ్లాక్‌స్టోన్, బ్రూక్‌ఫీల్డ్, వెస్టాస్, జెరా వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థల అధినేతలతో భేటీ అయి, ఏపీలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రపంచ వేదికపై ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను తిరిగి నిలబెట్టడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగింది.

## అనధికార లే ఔట్ల రెగ్యులేషన్ గడువు పొడిగింపు

అమరావతి, **జనవరి 23ఆంధ్ర ప్రగతి** అనధికార లేఅవుట్ల రెగ్యులరైజేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి గడువు పొడిగించింది. మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ ఈ మేరకు కీలక ప్రకటన చేశారు. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ 2025 కింద దరఖాస్తులు చేసుకునేందుకు ఏప్రిల్ 23 వరకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ పథకం కింద అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించు కోవాలనుకునే వారు రూ.10,000 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఇప్పటికే ఎల్ఆర్ఎస్?2025 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 61,947 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అనధికార లేఅవుట్ల రెగ్యులరైజేషన్ ప్రక్రియలో అధికారులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హెచ్చరించారు. ప్రజలు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా దరఖాస్తు చేసుకోవాలని, నిబంధనల ప్రకారం పారదర్శకంగా ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోపే దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ శాఖ కోరింది.

# అన్నివర్గాలకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇకపై బ్యాంకర్ల సమావేశానికి జిల్లా కలెక్టర్లను కూడా ఆహ్వానించాలని చంద్రబాబు సూచించారు. ఈ సమావేశంలో అధికారులకు సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. వివిధ రంగాలకు ఇచ్చే రుణాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ ఒక్కరూ ప్రైవేట్ వ్యక్తుల వద్ద రుణాలు తీసుకునే పరిస్థితి ఉండకూడదన్నారు. వ్యవసాయం సహా ఏ అవసరం వచ్చినా బ్యాంకుల వద్దకు వెళ్లి రుణాలు తీసుకునే పరిస్థితి రావాలని.. బ్యాంకర్లు ఆ దిశగా పని చేయాలని మార్గనిర్దేశం చేశారు. రెన్యూవబుల్ ఎనర్జీ రంగానికి బ్యాంకర్లు విరివిగా రుణాలు ఇవ్వాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెన్యూవబుల్ ఎనర్జీకి ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నాయని వెల్లడించారు. డిస్కంలు కూడా కౌంటర్ గ్యారంటీ ఇస్తున్నాయని.. రెన్యూవబుల్ ఎనర్జీ రంగానికి బ్యాంకర్లు ఇచ్చే రుణాలపై మరింత చొరవ చూపాలని దిశానిర్దేశర చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రుణాలు పెద్దఎత్తున ఇవ్వాలని..అప్పుడే అన్నిరంగాల్లో వారు ఎదుగుతారని చెప్పుకొచ్చారు. వారికోసం ప్రభుత్వం చేయాల్సింది చేస్తోందని.. బ్యాంకర్ల వైపు నుంచీ సహకారం ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలని.. పేద, ధనికుల మధ్య తారతమ్యాలు పోవాలని సూచించారు. రాజధాని అమరావతిని ఫైనాన్స్ సంస్థలకు కేంద్రంగా చేయాలని భావిస్తున్నామని వ్యాఖ్యానించారు. బ్యాంకులతో సహా వివిధ ఆర్థిక రంగ సంస్థలు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నాయని సీఎం వివరించారు. ఇటీవలే 15 బ్యాంకుల కార్యాలయాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని.. సంబంధిత నిర్మాణాలు మరింత ఊపందుకుని త్వరితగతిన పూర్తి కావాలని సూచించారు సీఎం. డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసిన విధంగానే.. ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను బలోపేతం చేయాలని మార్గనిర్దేశర చేశారు. టిడ్కో ఇళ్ల విషయంలో జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం వల్ల లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఆ టిడ్కో ఇళ్లకు రుణాలు ఇచ్చేందుకు కూడా బ్యాంకర్లు అంగీకరించడం లేదని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి తమ వైపు నుంచి ప్రయత్నిస్తున్నామని.. బ్యాంకర్లు కూడా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. డ్వాక్రా గ్రూపు బ్యాంక్ ఖాతాలపై 15 రకాల ఛార్జీలు వేస్తున్నారని, బ్యాంకర్లు ఈ ఛార్జీలను తగ్గించాలన్నారు. భూ రికార్డులను ప్రక్షాళన చేస్తున్నామని.. వైసీపీ ప్రభుత్వం 22ఏ పేరుతో భూ వివాదాలు సృష్టించిందని ప్రస్తావించారు. ఇప్పుడీ భూ రికార్డులకు పూర్తి స్థాయిలో భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇస్తున్నామని తెలిపారు. బ్యాంకర్లు కూడా బ్యాంక్ ఖాతాల కోసం క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెడితే బాగుంటుందేమో ఆలోచించాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇదిలావుంటే దావోస్ పర్యటన ముగించుకుని శుక్రవారం అమరావతికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. వచ్చీరాగానే నేరుగా సచివాలయానికి చేరుకుని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశానికి హాజరయ్యారు. వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా ఇప్పటి వరకు వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.2.96 లక్షల కోట్ల మేర రుణాలను బ్యాంకర్లు అందజేశారు. అలాగే కౌలు రైతులకు రూ.1,490 కోట్ల మేర వ్యవసాయ రుణాలిచ్చారు. ఎంఎస్ఎంఈలకు రూ. 95,714 కోట్ల మేర రుణాలను బ్యాంకర్లు జారీచేశారు. ఈ సమావేశంలో అమరావతిని ఫై÷నాన్షియల్ హబ్‌గా తీర్చిదిద్దే అంశంపై సీఎం చంద్రబాబు చర్చించారు. రాజధానిలో సెంట్రల్ బిజినెస్ డిస్టిక్ట్ర ఏర్పాటుపై బ్యాంకర్లతో చంద్రబాబు సమాలోచనలు జరిపారు.అంతేకాకుండా.. ఏపీ టిడ్కో రుణాలు, డ్వాక్రా సంఘాల లింకేజీ, కేంద్ర పథకాలు, స్టార్టప్‌లకు బ్యాంకుల సహకారం వంటి కీలక అంశాలపై సీఎం సమీక్షించారు. ఈ సమావేశానికి మంత్రులు పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, చీఫ్ సెక్రెటరీ విజయానంద్, యూనియన్ బ్యాంక్ ఎండీ, ఆర్‌బీఐ ప్రాంతీయ డైరెక్టర్, నాబార్డు జీఎం తదితరులు హాజరయ్యారు. అలాగే వివిధ బ్యాంకుల ప్రతినిధులు, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ డైరెక్టర్లు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# కేరళలో కొత్త రైళ్లకు ప్రధాని మోదీ పచ్చజెండా.

తిరువనంతపురం **జనవరి 23ఆంధ్ర ప్రగతి**

ప్రధాని నరేంద్ర మోదీ కేరళలో కొత్త రైల్వే సేవలకు ఈరోజు పచ్చజెండా ఊపారు. తిరువనంతపురం నుంచి మూడు కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు ఒక ప్యాసింజర్ రైలును ఆయన ప్రారంభించారు. దేశంలో రైల్వే కనెక్టివిటీని ఆధునికీకరించే ప్రయత్నాల్లో భాగంగా ఈ కొత్త సర్వీసులను అందుబాటులోకి తెచ్చారు.

కొత్తగా ప్రారంభించిన వాటిలో తిరువనంతపురం-చర్లపల్లి, నాగర్‌కోయిల్-మంగళూరు, తిరువనంతపురం-తాంబరం అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. వీటితో పాటు త్రిస్సూర్-గురువాయూర్ మధ్య కొత్త ప్యాసింజర్ రైలును కూడా ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం ఈ రైళ్లు తమ గమ్యస్థానాలకు బయలుదేరాయి. ఈ నాలుగు సర్వీసులను దక్షిణ రైల్వే నిర్వహించనుంది.తిరువనంతపురం-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ ప్రయాణిస్తుంది. ఇది తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చనుంది. అలాగే, తిరువనంతపురం-తాంబరం రైలు తమిళనాడులోని పారిశ్రామిక, విద్యా కేంద్రాలకు అనుసంధానంగా ఉంటుంది.

అమృత్ భారత్ రైళ్లను సామాన్యులకు తక్కువ ధరలో మెరుగైన సౌకర్యాలు అందించేలా రూపొందించారు. ఇవి నాన్-ఏసీ రైళ్లు అయినప్పటికీ, వీటిలో ప్రయాణికుల భద్రత కోసం ప్రతి కోచ్‌లో సీసీటీవీ కెమెరాలు, ప్రతి సీటుకు ఫోన్ చార్జర్ సాకెట్, బాటిల్ హోల్డర్ వంటి వసతులు కల్పించారు. కోచ్‌లు విశాలంగా, సౌకర్యవంతంగా ఉన్నాయని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. సంప్రదాయ రైళ్లకు, ప్రీమియం రైళ్లకు



మధ్య అంతరాన్ని తగ్గించి, తక్కువ ఛార్జీలతో మెరుగైన ప్రయాణ అనుభూతిని అందించడమే ఈ రైళ్ల లక్ష్యమని రైల్వే అధికారులు తెలిపారు.

### ఇక తమిళనాడు ఎన్‌డీఏతోనే: తమిళనాడు, కేరళలో ప్రచారానికి ప్రధాని శ్రీకారం

దక్షిణాదిన ఇంతవరకు బీజేపీని ఆదరించని తమిళనాడు, కేరళల్లో ప్రధాని మోదీ శుక్రవారం అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించారు. పాలక పార్టీలు/కూటములపై విరుచుకుపడ్డారు. ప్రధానంగా తమిళనాడులో డీఎంకే టైమైపోయిందన్నారు. అవినీతి డీఎంకే ప్రభుత్వానికి వీడ్కోలు పలకాలని రాష్ట్ర ప్రజలు నిర్ణయించేశారని తెలిపారు. ఇక తమిళనాడు ఎన్‌డీఏతోనే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. చెన్నై సమీపంలోని మదురాంతకంలో జరిగిన భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. 'డీఎంకే ప్రభుత్వ నిష్క్రమణకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఇది అవినీతి, మాఫియా, నేరాల (కరప్షన్-మాఫియా-క్రైం(సీఎంసీ) సర్కారు. అది ఒక కుటుంబాన్ని మాత్రమే సేవిస్తోంది. ఈ పార్టీలో ఎదగాలంటే.. వారసత్వం, అవినీతి, మహిళలపై అసభ్య వ్యాఖ్యలు, భారత సంస్కృతిని తూలనాడడం.. ఇవే మార్గాలు' అని ధ్వజమెత్తారు. సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ పేరు ప్రస్తావించకుండా ఈ వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు అభివృద్ధికి కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఎంతో చేసిందని ప్రధాని అన్నారు. 2014కి ముందు కేంద్ర ప్రభుత్వంలో కాంగ్రెస్, డీఎంకే భాగస్వాములుగా ఉన్నప్పుడు విడుదలైన నిధుల కంటే 3 రెట్ల నిధులను తన ప్రభుత్వం తమిళనాడుకు ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో ఎంత అవినీతి జరుగుతోందో, ఆ డబ్బు ఎవరి జేబుల్లోకి చేరుతోందో చిన్నపిల్లలకు కూడా తెలుసన్నారు. స్టాలిన్ జమానాలో డ్రగ్స్, మద్యం మాఫియా మాత్రమే పురోగతి సాధించాయని చెప్పారు. రాష్ట్ర ప్రజలు డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మిత్రపక్షం అన్నాడీఎంకే అధినాయకురాలు, దివంగత మాజీ సీఎం జయలలితను ప్రశంసించారు. ఆమె హయాంలో శాంతిభద్రతలు భేషుగ్గా ఉండేవని.. మహిళలకు సంపూర్ణ రక్షణ ఉండేదని తెలిపారు. మదురైలో తిరుప్పన్‌కుండ్రం కొండపై దీపోత్సవానికి సంబంధించిన వివాదాన్ని కూడా ప్రధాని ప్రస్తావించారు. భక్తులకు బీజేపీ మద్దతుగా నిలువగా.. డీఎంకే మాత్రం ఓటుబ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యమిచ్చిందని విమర్శించారు. ఈ సభలో అన్నాడీఎంకే అధినేత పళనిసామి, ఏఎంఎంకే చీఫ్ టీటీవీ దినకరన్, పీఎంకే అధినేత అన్బుమణి రామ్‌దాస్ తదితర మిత్రపక్షాల నేతలు పాల్గొన్నారు.

# ఏడు గంటలు కేటీఆర్ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

అంశాలపై సిట్ కేటీఆర్‌పై ప్రశ్నల వర్షం కురిపించింది. ఫోన్‌ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ సిట్ ఇచ్చిన నోటీసు మేరకు శుక్రవారం ఉదయం 10:50 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయానికి కేటీఆర్ భారీ ర్యాలీగా చేరుకున్నారు. బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ కార్యాలయం నుంచి పలువురు నాయకులు భారీ సంఖ్యలో కార్యకర్తలతో కేటీఆర్ ఊరేగింపుగా రావడంతో జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయానికి 200 అడుగుల దూరంలోనే కార్యకర్తలు, ఇతర నాయకులను పోలీసులు ఆపేశారు.

కేవలం కేటీఆర్ కారును మాత్రమే ఏసీపీ కార్యాలయంలోకి అనుమతించారు. దాంతో పెద్ద ఎత్తున పోలీసులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేస్తూ రోడ్డు మీదనే బైటాయించారు. ఏసీపీ కార్యాలయంలోకి ప్రవేశించిన కేటీఆర్‌ను అప్పటికే వేచి ఉన్న సిట్ అధికారులు ఆయనను ప్రత్యేక గదిలో కూర్చోబెట్టి కొద్ది సేపటి తర్వాత ప్రశ్నించడం ప్రారంభించారు. ఈ విచారణలో డీసీపీలు రితురాజ్, నారాయణ్‌రావు, ఏసీపీలు వెంకటగిరి, శ్రీధర్ తదితరులు పాల్గొనగా.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నగర స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ విజయ్ కుమార్ కూడా పాల్గొన్నారు. ముఖ్యంగా రూ.12 కోట్లు విలువ చేసే ఎలక్టోరల్ బాండ్స్‌ను సంధ్య శ్రీధర్ నుంచి అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు ద్వారా ఒత్తిడి తీసుకొచ్చి మీరు వసూలు చేసింది నిజమేనా? అంటూ ప్రశ్నల వర్షాన్ని సిట్ అధికారులు ప్రారంభించినట్టు తెలిసింది. ఈ విధంగా ఎన్ని కోట్ల రూపాయలను ఎలక్టోరల్ బాండ్స్ పేరిట సేకరించారు, అందుకు మీరు ఎస్ఐబీకి చెందిన కొందరు అధికారుల సహకారాన్ని తీసుకున్న మాట నిజమేనా అని కూడా ప్రశ్నించినట్టు సమాచారం.

అలాగే సిరిసిల్లలో ఫోన్‌ట్యాపింగ్ వార్‌రూమ్‌ను ఏర్పాటు చేసి అక్కడి నుంచి కొన్ని ఫార్మాస్యూటికల్ కంపెనీలు, మరికొందరు వ్యాపారవేత్తలు, సినీ సెలెబ్రిటీల ఫోన్‌ట్యాపింగ్‌లకు పాల్పడింది నిజమేనా అని కూడా సిట్ ప్రశ్నించినట్టు తెలిసింది. అయితే ఏయే సినీనటులు నేను బెదిరించినట్టు మీకు ఫిర్యాదు చేశారని కేటీఆర్ అధికారులను ఎదురు ప్రశ్నించినట్టు సమాచారం. అందుకు మా ప్రశ్నలు అవునా, కాదా అని సమాధానమివ్వండని సిట్ అధికారులు కేటీఆర్‌ను అడిగినట్టు తెలిసింది. అదే సమయంలో, రాధాకిషన్‌రావుకు మీరు కొన్ని ఫోన్ నెంబర్లను పంపించి ట్యాపింగ్ చేయాలని చెప్పారట కదా అనే ప్రశ్నకు.. అలా చెప్పినట్టు ఆయన చెప్పారా అంటూ కేటీఆర్ ఎదురు ప్రశ్నించినట్టు సమాచారం. కాగా పోలీసు అధికారులతో నాకు సంబంధమేమిటని కేటీఆర్ ప్రశ్నించగా.. మరి రాధాకిషన్‌రావు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావులకు పలుమార్లు మీరు ఫోన్ చేసినట్టుగా ఉంది కదా అని సిట్ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. అదే సమయంలో ఒక అధికారి కేటీఆర్ ముందు కొందరి పేర్ల జాబితాను ఉంచి వీరంతా మీకు తెలుసా అని ప్రశ్నించగా.. రాజకీయ నాయకుడిగా చాలా మంది కలుస్తారు, మాట్లాడుతారు అందరినీ గుర్తు పెట్టుకోలేం కదా అని ఆయన సమాధానమిచ్చినట్టు సమాచారం.

మధ్యాహ్నం 2-3 గంటల వరకు భోజన విరామం ఇచ్చాక.. సాయంత్రం 6.15 గంటల వరకు కేటీఆర్‌కు పలు ప్రశ్నలను సిట్ అధికారులు సంధించినట్టు తెలిసింది. కొన్నింటికి సమాధానమిచ్చిన కేటీఆర్ మరికొన్ని ప్రశ్నలకు ఎదురు ప్రశ్నలు వేస్తూ పోయారని సమాచారం. మొత్తమ్మీద ఏడు గంటలకు పైగా కేటీఆర్‌ను విచారించిన సిట్ అధికారులు.. ఆ సమాచారాన్ని పూర్తిగా రికార్డు చేసినట్టు తెలిసింది. చివరగా విచారణ కొనసాగుతున్నదనీ, అవసరమైతే మరోసారి పిలుస్తామని సిట్ అధికారులు కేటీఆర్‌కు తెలిపి పంపించివేశారని సమాచారం. సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయం నుంచి వెలుపలికి వచ్చిన కేటీఆర్‌ను చూసి, బయట వేచి ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద పెట్టున 'కేటీఆర్ జిందాబాద్', 'పోలీస్ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. వారి నినాదాల మధ్య కారెక్కిన కేటీఆర్.. తన కాన్వాయ్ తో వెళ్లారు.

# డబ్ల్యూహెచ్‌వో నుంచి వైదులుగుతున్నట్లు అమెరికా ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

కొవిడ్ మహమ్మారిని అదుపు చేయడంలో, సంస్కరణలను అమలుచేయడంలో డబ్ల్యూహెచ్‌వో విఫలమైందని అమెరికా ఆరోగ్య, మానవ సేవల విభాగం తెలిపింది. ఇకపై డబ్ల్యూహెచ్‌వోకు అమెరికా నుంచి వచ్చే అన్నిరకాల నిధులు నిలిపివేస్తున్నామని.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాని అన్ని కార్యాలయాల నుంచి యూఎస్ సిబ్బందిని వెనక్కి పిలిపించినట్లు వెల్లడించింది. ఈ సంస్థకు సంబంధించిన సాంకేతిక కమిటీలు, వర్కింగ్ గ్రూపుల నుంచి కూడా తప్పుకుంటున్నట్లు తెలిపింది. అయితే ఇకనుంచి పరిమిత పరిధి మేరకు డబ్ల్యూహెచ్‌వోతో కలిసి పనిచేయనున్నట్లు యూఎస్ ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. అయితే డబ్ల్యూహెచ్‌వో నుంచి అగ్రరాజ్యం వైదొలిగే సమయానికి అమెరికా దానికి 260 మిలియన్ డాలర్ల (రూ.2,382 కోట్లు) బకాయిలను చెల్లించాల్సి ఉందని బ్లూమ్‌బెర్గ్ నివేదికలు వెల్లడించాయి. ఈ విషయంపై డబ్ల్యూహెచ్‌వో అధికారులు మాట్లాడుతూ.. సంస్థ నుంచి తప్పుకుంటున్నట్లు అమెరికా వెల్లడించగానే సరిపోదని.. సంస్థకు బకాయిపడిన 260 మిలియన్ డాలర్లను చెల్లించేవరకు డబ్ల్యూహెచ్‌వో నుంచి యూఎస్ ఉపసంహరణ పూర్తి కాదన్నారు. అయితే ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెల్లించాల్సిన బకాయిలపై అమెరికా అధికారిక వర్గాలు స్పందిస్తూ.. సంస్థ నుంచి వైదొలగడానికి ముందు బకాయిలను పూర్తిగా చెల్లించాలనే చట్టబద్ధమైన నియమమేమీ లేదన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 24 జనవరి 2026

## శ్రీ సంకల్ప్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మరియు శ్రీ శాంతినికేతన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో

# ఘనంగా వసంత పంచమి వేడుకలు.









**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 23:**
శ్రీ సంకల్ప్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మరియు శ్రీ శాంతినికేతన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలు సంప్రదాయం, సంస్కృతి, ఆధునిక సాంకేతికత సమ్మేళనంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల ప్రవేశ ద్వారం నుంచే ప్రత్యేకంగా మూడు వృత్తాకార అలంకరణలు ఏర్పాటు చేశారు. మొదటి వృత్తంలో "అమ్మ", రెండవ వృత్తంలో "నాన్న", మూడవ వృత్తంలో "ఇల్లు" అని రాసి, పిల్లల జీవితంలో కుటుంబ ప్రాధాన్యతను ప్రతీకాత్మకంగా చూపించారు. అనంతరం, సీతాకోకచిలుక (బటర్‌ఫ్లై) ఆకృతిలో పాఠశాల పేరును ఏర్పాటు చేయడం ద్వారా, శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్‌లో చదువుకుంటూ పిల్లలు సీతాకోకచిలుకలా రెక్కలు విప్పి ఎగిరే అందమైన భవిష్యత్తును పొందాలన్న సందేశాన్ని తెలియజేశారు.
బటర్‌ఫ్లై థీమ్‌తో రూపొందించిన సెల్ఫీ బోర్డ్ విద్యార్థులు, తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకుంది.
వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాసం కార్యక్రమం పూజారులచే శాస్త్రోక్తంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీ సుధాకర్ గారు మరియు శ్రీమతి రమ్య రెడ్డి గారు పాల్గొని చిన్నారులకు తొలి అక్షరాలను పరిచయం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు మరింత శోభను చేకూర్చాయి. చిన్నారుల నృత్యాలు, పాటలు, ప్రదర్శనలు అందరినీ అలరించాయి.
కార్యక్రమంలో చైర్మన్ శ్రీ సుధాకర్ మాట్లాడుతూ, విద్యతో పాటు విలువలు, సృజనాత్మకత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పిల్లలకు ఎంత అవసరమో వివరించారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. వేడుకలో మరో వినూత్న అంశంగా, తల్లిదండ్రులకు 1 నుంచి 30 వరకు నంబర్లు ఇచ్చి తమ పిల్లల కోసం ఒక నంబర్‌ను ఎంచుకునే అవకాశం కల్పించారు. ఆ నంబర్ ఆధారంగా పిల్లల భవిష్యత్తు వృత్తి అంచనాను వెల్లడించారు. అనంతరం, ఏఐ (AI) సాంకేతికత సహాయంతో, ఆ వృత్తికి అనుగుణంగా పిల్లల ఫోటోలను తక్షణమే రూపొందించి చూపించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ ప్రత్యేక కార్యక్రమం తల్లిదండ్రులు, విద్యార్థుల్లో అపారమైన ఆనందం, ఉత్సాహాన్ని నింపింది. సంప్రదాయాలతో పాటు ఆధునికతను సమన్వయం చేస్తూ విద్యాబోధన అందించడమే శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్ లక్ష్యమని ఈ వసంత పంచమి వేడుక మరోసారి నిరూపించింది.

## బాల అకాడమీ పాఠశాలలో వైభవంగా


# జరిగిన వసంత పంచమి వేడుకలు.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 23:**
నంద్యాల పట్టణంలోని పార్క్ రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో ఈరోజు అనగా శుక్రవారము వసంత పంచమి మరియు అక్షరాభ్యాస కార్యక్రమములను ఘనంగా జరుపుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో లక్ష్మణాచారి, కార్తీక్, ఫనీంద్ర పూజరులచేత మొదటిగా సరస్వతీ లక్ష్మీ గణపతి హోమం కూడా చేయడము జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ ప్రిన్సిపల్ శ్రీమతి మాధవీలత విచ్చేసి మాట్లాడుతూ సరస్వతీ దేవి జన్మదినమైన మాఘ శుద్ధ పంచమి రోజున అక్షరాభ్యాసం చేయించడం వలన చిన్నారులకు సకల విద్యలు ప్రాప్తిస్తాయని మన నమ్మకం. మా బాల అకాడమీ పాఠశాలలో ప్రతి సంవత్సరము ఆనవాయితీగా అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నాము. భగవంతుని దీవెనలు మెండుగా అందాలని కోరుకుంటున్నామని తెలియజేశారు. ఇటువంటి దీవెనకరమైన కార్యక్రమమును ఏర్పాటు చేసినందుకు పాఠశాల చిన్నారుల తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యానికి ప్రత్యేకమైన ధన్యవాదములను తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్ ప్రిన్సిపల్ శ్రీమతి మాధవీలత మేడం పాఠశాల చిన్నారుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## చెంచుల మధ్య లోకేష్ బాబు జన్మదిన వేడుకలు.

**హాజరైన ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప గిరిజన మండలి సలహా సభ్యులు వెంకటపతి.**



**ఆంధ్ర ప్రగతి వెలుగోడు జనవరి 23:** శుక్రవారం నాడు వెలుగోడు మండల కేంద్రంలో చెంచుగూడెం నందు చెంచు జనాల మధ్య రాష్ట్ర ఐటీ శాఖ మాత్యులు నారా లోకేష్ బాబు గారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. జన్మదిన వేడుకలకు సంబంధించి దాదాపు 500 పైగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ సభ్యులు వెంకటప్ప గిరిజన సలహ మండలి సభ్యులు వెంకటపతి మాట్లాడుతూ నారా లోకేష్ బాబు ఈ రాష్ట్రంలోని యువతకు ఆదర్శమని ముఖ్యంగా గిరిజనులకు సంక్షేమ పథకాలను చేరువయ్యే విధంగా కృషి చేస్తున్నారని గిరిజనుల పట్ల విశ్వాసం గా ఉన్నారని గిరిజన గ్రామాల అభివృద్ధి లోకేష్ బాబు తోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప, టిడిపి రాష్ట్ర నాయకులు గుండాల నాయక్, టీఎస్ ఎఫ్ నాయకులు వెంకటేష్ అంజి నాయక్ లోకు నాయక్ ఎరుకుల సంఘం నాయకులు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.


## పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యం.

**సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ జనవరి 23:**
పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు "పోలీస్ సంక్షేమ దివస్" ను నేడు నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ నిర్వహించారు.
జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లు మరియు విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది, హోంగార్డ్స్ వారి యొక్క సమస్యల గురించి ఎస్పీ కి తెలియచేసినారు. జిల్లా ఎస్పీ సిబ్బంది నుండి వినతులను స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను సమగ్రంగా అడిగి తెలిసికొని వాటిపై సత్వరమే తగు పరిష్కార చర్యలు తీసుకుంటామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కారించాలని సంబంధిత పోలీస్ ప్రధాన కార్యాలయం అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది యొక్క సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ, పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమం ద్వారా సిబ్బంది సమస్యలపై సత్వర చర్యలు తీసుకోని పరిష్కరిస్తున్నామన్నారు. విధులలో సిబ్బంది ఇబ్బంది పడకుండా వారి సమస్యల తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యటమే లక్ష్యమని తెలియ చేసినారు.

## ఓటర్ల చేత ప్రతిజ్ఞ నిర్వహించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జనవరి 23:**
భారత ఎన్నికల సంఘం స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకొని 2011 సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవంను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లోని వివిధ శాఖల సిబ్బందితో కలెక్టర్ ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత పౌరులమైన మేము ప్రజాస్వామ్యంపై సంపూర్ణ విశ్వాసంతో, దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాపాడుతూ, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల నిర్వహణకు కట్టుబడి ఉంటామని; మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు లోనుకాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు హక్కును వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, చేర్పులు-తొలగింపులు, మార్పులు, తప్పుల్లేని ఓటరు జాబితా తయారీ, పోలింగ్ శాతం పెంపు కోసం తీసుకోవాల్సిన చర్యలు, అలాగే 1819 సంవత్సరాల వయస్సు గల యువత ఓటరు నమోదు అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు.

# పీఎంఎఫ్ఎంఈ పథకం కింద రోటీ మేకర్ యూనిట్ ప్రారంభం.

**ఆహార శుద్ధి రంగంలో స్వయం ఉపాధికి విస్తృత అవకాశాలు. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జనవరి 23:**
పీఎంఎఫ్ఎంఈ పథకం కింద ఏర్పాటు చేసిన రోటీ మేకర్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం ప్రాంతంలో ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో అల్ల రామిరెడ్డి ద్వారా ఏర్పాటు చేసిన ఈ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ఆహార శుద్ధి రంగంలో నంద్యాల జిల్లాలో గణనీయమైన ప్రగతి సాధించబడుతోందని తెలిపారు. పీఎంఎఫ్ఎంఈ పథకం ప్రధాన లక్ష్యం "ఒక్కో ఇంటి నుంచి ఒక చిన్న పారిశ్రామికవేత్తను తయారు చేయడం" అని స్పష్టం చేశారు. ఈ పథకం కింద లబ్ధిదారులకు యూనిట్ వ్యయంపై 35 శాతం సబ్సిడీతో పాటు, బ్యాంకుల ద్వారా 90 శాతం వరకు రుణ సౌకర్యం కల్పించబడుతుందని, లబ్ధిదారుడు కేవలం 10 శాతం మాత్రమే స్వంత వాటాగా చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఈ పథకం ద్వారా రోటీ మేకింగ్ యూనిట్లతో పాటు ఐస్‌క్రీమ్ తయారీ, పచ్చళ్ల తయారీ, బేకరీలు, నూడుల్స్ తయారీ, పానీపూరి తయారీ వంటి వివిధ రకాల ఆహార శుద్ధి యూనిట్లను ఏర్పాటు చేసుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కేవలం తయారీ దశకే పరిమితం కాకుండా, బ్రాండింగ్, మార్కెటింగ్, మౌలిక సదుపాయాల కల్పనకు కూడా ఈ పథకం ద్వారా పూర్తి స్థాయి సహకారం అందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నంద్యాల జిల్లాలో మొత్తం 188 యూనిట్లకు మంజూరు లభించగా, వాటిలో 70 యూనిట్లు ఇప్పటికే గ్రౌండ్ అయ్యాయని, అదనంగా మరో 50 మంది లబ్ధిదారులను గుర్తించామని తెలిపారు. ఈ పథకాన్ని వ్యక్తిగత లబ్ధిదారులతో పాటు స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు. అర్హత గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగరాజు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.


## బస్సు ప్రమాదంలో 36 మందిని
# కాపాడిన వీరులకు సన్మానం.

**సత్కరించిన ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్.**





**ఆంధ్ర ప్రగతి సిరివెళ్ల జనవరి 23:**నంద్యాల జిల్లా సిరివెళ్ల మెట్ట మెట్ట వద్ద ఇటీవల జరిగిన ఏ ఆర్ బి సి బి ఆర్ ట్రావెల్స్ బస్సు ప్రమాదం సమయంలో అప్రమత్తత, సాహసం, మానవత్వాన్ని ప్రదర్శించి 36 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన సిర్వెల్ గ్రామానికి చెందిన షేక్ మెహరాజ్ మరియు అతని మేనల్లుడు షేక్ సమీర్ (ఏపీ మోడల్ స్కూల్, సిర్వెల్ విద్యార్థి)లనుఆల్ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ నంద్యాల జిల్లా, సిర్వెల్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.ప్రమాద సమయంలో బస్సు అద్దాలను పగలగొట్టి లోపల చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసి వారి ప్రాణాలను రక్షించిన ఈ ఇద్దరి ధైర్యసాహసాలను గుర్తించి,షేక్ మెహరాజ్‌కు రూ.10,000/-షేక్ సమీర్‌కు రూ.5,000/-నగదు బహుమతులతో పాటు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సత్కార కార్యక్రమం సిర్వెల్ మెట్టలోని ఆర్కె ఆటో మొబైల్స్ ప్రాంగణంలో నిర్వహించబడింది.ఈ సందర్భంగా ఆల్ మేవా ఏపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు సయ్యద్ ముహమ్మద్ ఫరూక్ మాట్లాడుతూ, మానవ సేవే మహత్తరమైన సేవ అని, ఇలాంటి ధైర్యసాహసాలు సమాజానికి ఆదర్శమని తెలిపారు. యువత ఈ వీరుల స్ఫూర్తితో సేవాభావాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆల్ మేవాఏపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు డీఎస్ నూరుల్లా, సిరివెళ్ల శాఖ ఉపాధ్యక్షులు కే అహ్మద్ హుస్సేన్, కార్యవర్గ సభ్యులు మహమ్మద్ హుస్సేన్, డి.రవూఫ్ గౌస్ , సిరివెళ్ల అబిద్ , సిరివెళ్ల ఖాజీ సాహెబ్, సాఫ్ట్వేర్ ఇంజనీర్ అతర్ నిజాం గారు, సిరివెళ్ల గ్రామం సామాజిక కార్యకర్తలు టీఎస్ హక్కానీ , అత్తర్ సిద్దిక్, షేక్ అక్బర్ బాషా, మరియు పెద్ద సంఖ్యలో సిరివెళ్ల గ్రామ యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో
# వైభవంగా వసంత పంచమి వేడుకలు.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 23:**
నందల పట్టణంలోని శ్రీ గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురురాజా ఓపెన్ ఆడిటోరియం నందు అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లుగా స్కూల్ డైరెక్టర్ పి షేక్షావలి రెడ్డి తెలిపారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని సరస్వతి తల్లికి వేద పండితుల సమక్షంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. రెండున్నర సంవత్సరాలు నిండిన చిన్నారులకు గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డా.పి. దస్తగిరి రెడ్డి, డైరెక్టర్ మౌలాలి రెడ్డి ఓం నమశ్శివాయ పంచాక్షరితో విద్యార్థులకు పలక మీద అక్షరాభ్యాసం చేయించి వారికి విద్యా విజ్ఞానం ఆయురారోగ్యాలు పొందాలని దీవించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు. వేద పండితులకు చైర్మన్ పట్టు వస్త్రాలు అందజేసి వారి ఆశీస్సులను స్వీకరించారు.







# చెంచుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు.

**- ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యులు పి వెంకటప్ప.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జనవరి 23:**
చెంచులతో శుక్రవారం నాడు సమావేశం నిర్వహించిన శ్రీ పి వి పి వెంకటప్ప ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎస్టి కమీషన్ సభ్యులు, వెంకటపతి రాష్ట్ర గిరిజన సలహామండలి సభ్యులు. ఈ రోజు నంద్యాల జిల్లా వెలుగోడు విజయ దుర్గ చెంచు గూడెం నందు సందర్శించడం జరిగింది అందులో భాగంగా శ్రీ వెంకట శివప్రసాద్ ప్రాజెక్టు ఆఫీసర్ ఐటీడీఏ శ్రీశైలం వారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యులు పి వెంకటప్ప, ఆంధ్రప్రదేశ్ గిరిజన సలహా మండలి సభ్యులు వెంకటపతి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలాగున చూడాలని అలాగే వివిధ మండలాల నుంచి వచ్చినటువంటి చెంచులు అందరికి కూడా వారి సమస్యలను విని వెంటనే అధికారులకు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పడం జరిగినది ముఖ్యంగా వెలుగోడు చెంచుగూడెం కు 40 లక్షలతో సిసి రోడ్డు మంజూరు చేయించడం జరిగినది అలాగే గృహాలకు సంబంధించి పి ఎం జన్మాన్ ద్వారా 45 గృహాలను మంజూరు కావాలని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడం జరిగినది వచ్చిన వెంటనే ప్రతి ఒక్కరికీ ఇల్లు కట్టించే బాధ్యత ఐటిడిఏ/ హౌసింగ్ శాఖల సమన్వయంతో ఇల్లు పూర్తి చేస్తామని చెప్పడం జరిగినది. ప్రతి ఒక్క చెంచుగూడెం



లో కూడా మౌలిక వసతుల కల్పన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలాగున కూటమి ప్రభుత్వం ద్వారా ప్రతి ఒక్క గిరిజనులు కూడా సంక్షేమ పథకాల అందాలి అనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పడం జరిగినది. ప్రతి మనిషికి ముఖ్యంగా ఆధార్ కార్డు అనేటువంటిది చాలా ముఖ్యము ఆధార్ కార్డు లేని వారికి వెంటనే ఆధార్ కార్డు తీపించాలి పుట్టిన తేదీ సర్టిఫికెట్లు ప్రతి ఒక్కరికి ఇవ్వాలి మరియు వారంలో ఒకరోజు ప్రతి ఒక్క మండల స్థాయి అధికారి కూడా చెంచుగూడెంలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకొని శాఖల సమన్వయంతో పరిష్కరించాలని అధికారులకు ఆదేశించడం అయినది . వివిధ చెంచుగూడెంలో నుంచి వచ్చిన ప్రతి ఒక్కరి సమస్యలు



కూడా పరిష్కరిస్తామని చెప్పడం జరిగినది. ప్రస్తుతానికి వెలుగోడు విజయదుర్గ చెంచు కాలనీ లోని 45 కుటుంబాలకు తార్పాలిన్ పట్టలు పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి పీఎం ఏపీడి ఐటీడీఏ ఆత్మకూరు, వెలుగోడు, బండి ఆత్మకూరు మండల స్థాయి అధికారులు, ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప, చెంచు సంఘం నాయకులు హుస్సేనమ్మ,నారాయణమ్మ, సుగాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు గుండాల నాయక్, టి ఎస్ ఎఫ్ నాయకులు వెంకటేష్ అంజి నాయక్ లోకనాయక్ రాము నాయక్, ఎరుకుల సంఘం నాయకుడు పెద్ద ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూరు సుబ్బరాయునిలో పంచాయతీరాజ్ శాఖ
# డి.ఈ నాగ శ్రీనివాసులు పూజలు..!

**-ఆలయ ఈవో యం.రామక్రిష్ణ.**

**ఆంధ్ర ప్రగతి ఎస్.కొత్తూరు./పాణ్యం జనవరి 23:**
ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామాల్లో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి సన్నిధిలో బనగానపల్లె పంచాయతీరాజ్ శాఖ డీ.ఈ బిల్లీ నాగ శ్రీనివాసులు శుక్రవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల నారాయణ శర్మ, సురేష్ శర్మ సిబ్బంది ఆలయ మర్యాదలైన పూర్ణకుంభంతో స్వాగతం పలికి శ్రీ స్వామివారికి అభిషేకములు, అర్చనలు పలు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వ మంటపము నందు శాలువాలు, శేష వస్త్రములు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు క్రిష్ణయ్య స్వామి, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.ద



# యువగళం స్ఫూర్తితో అభివృద్ధి బాటలో రాష్ట్రం.

**-మార్తాడు గ్రమంలో ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు.**

**-యువతకు ప్రేరణగా లోకేశ్ నాయకత్వం.**

**-టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య.**



**ఆంధ్ర ప్రగతి గార్లదిన్నె జనవరి 23:**టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేశ జన్మదిన వేడుకలు మార్తాడు గ్రామంలో లో కార్యకర్తలు, అభిమానులు మధ్య లోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య మాట్లాడుతూ.. యువగళం పాదయాత్ర ద్వారా లోకేశ తన సత్తా ఏమిటో చాటారన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం లోకేష్ ఎన్నో సంస్కరణలు చేపట్టారని అలాగే ప్రజాదర్బార్ చేపట్టి ప్రజల నుండి విజ్ఞాపనలు తీసుకోవడమే కాకుండా అవి ఎంత వరకు పరిష్కారమయ్యాయో నిరంతరం తెలుసుకుంటూ పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. రేపటి సమాజాన్నితీర్చిదిద్దేది బడి. అటువంటి బడి నిర్వహణ విద్యాశాఖ చేతిలో ఉంటుంది. ఒక ఉన్నత విద్యావంతుడు విద్యా మంత్రి అయితే ఆ శాఖకు ఎంతటి మేలు జరుగుతుందో మంత్రి లోకేష్ చేసి చూపించారని కొనియాడారు. విద్యతో పాటు ఐటీ, నైపుణ్యాభివృద్ధి రంగాల్లోనూ లోకేశ్ గ్లోబల్ స్థాయి పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. లోకేశ్ రాజకీయాల్లో తండ్రి చంద్రబాబు నాయుడికి తగ్గ తనయుడిగా రాష్ట్ర భవిష్యత్తులో కీలక పాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. మెగా డిఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టి ఉపాధ్యాయ లోటును గణనీయంగా తగ్గించారని, యువతను కేంద్రంగా చేసుకుని అభివృద్ధి, విద్య, ఉపాధి రంగాల్లో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్రాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మామా అల్లుళ్లను వెంటాడిన విధి.

**నెల రోజుల క్రితం అనారోగ్యంతో మామ మృతి.**

**ఒంటరితనంతో మనోవేదనకు గురైన అల్లుడు. -జీవితంపై విరక్తి వచ్చి అల్లుడు ఆత్మహత్య.**

**ఆంధ్రప్రదేశ్ నంద్యాల జనవరి 23:**
ప్రతినిత్యం సన్నిహితంగా ఉంటూ.. కష్టసుఖాల్లోనూ కలిసి ఉండే మామ అల్లుళ్లు. పేరుకు మామా అల్లుడు లే కానీ ఇద్దరు మంచి స్నేహితులు కూడా. రక్తం పంచుకుని పుట్టకపోయినా అన్నదమ్ముల్లా.. స్నేహితుల్లా ఉండేవారు. ఎంతో ప్రేమతో కలిసి మెలిసి ఉండే మామా అల్లుడిని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు సైతం ఎంతో సంబరపడేవారు. అయితే చిన్ననాటి నుండి వారి విడదీయరాని బంధాన్ని చూసి విధికి కూడా కన్ను కుట్టిందేమో.. ఓర్వలేని విధి ముందుగా మామను మృత్యు రూపంను తీసుకెళ్లింది. నెల తిరగకముందే అల్లుడు కూడా వెంటాడి తీసుకువెళ్లిన ఘటన నంద్యాల జిల్లాలో చోటుచేసుకుంది. ఈ ఘటన మృతుని స్వగ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. లిమిలేములు, కష్టసుఖాల్లోనూ తోడుండే మామ మృతిని జీర్ణించుకోలేని యువకుడు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నెల రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన మామను పదేపదే తలుచుకుంటూ, తీవ్ర మనవయవేదన గురై జీవితంపై విరక్తి చెందిన కేశవరెడ్డి సురేందర్ రెడ్డి అనే యువకుడు శుక్రవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే ట్రాక్ పై తల తెగిపడిన



సురేందర్ రెడ్డిని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సురేంద్ర రెడ్డి ఆత్మహత్య చేసుకున్న వారికి తెలియగానే గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నంద్యాల మండలం ఉడుమాల్ పురం గ్రామానికి చెందిన సురేందర్ రెడ్డి, మామ శ్రీనివాస్ రెడ్డిలు మంచి మిత్రులు. పేరుకు మామా అల్లుడు కాని.. వీరి బంధం అంతకంటే ఎక్కువ. నిత్యం కలిసిమెలిసి తిరిగే మామా అల్లుళ్లను చూసి గ్రామస్తులు సైతం ఎంతో గర్వపడేవారు. కాగా నెల రోజుల క్రితం సురేంద్ర రెడ్డి మామ శ్రీనివాస్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటినుండి తీవ్ర మనోవేదన గురై ఒంటరితనంతో బాధపడుతున్న సురేంద్ర రెడ్డికి బంధువులు, కుటుంబ సభ్యులు,



స్థానికులు సైతం ఓదార్చి ధైర్యం చెప్పిన ఫలితం లేకుండా పోయింది. అయితే మామ లేని లోటు తనకెందుకు అనుకున్నాడో ఏమో.. శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన విన్న ప్రతి ఒక్కరికి కంటనీరు తెప్పిస్తోంది. ఘటనపై నంద్యాల పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. వ్యక్తిగత కారణాల వల్లే సురేందర్ రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రభ
తెలుగు దినపత్రిక
శనివారం 24 జనవరి 2026

## ఫిబ్రవరి లో జరిగే బాలోత్సవాలను విజయవంతం చేయండి.

**తృతీయ నంది బాలోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 23:** నంద్యాల జిల్లాలో నంది బాలోత్సవాలు ఫిబ్రవరి 17,18 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని ఈ బాలోత్సవాలలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బాలోత్సవాల ఆహ్వాన సంఘం అధ్యక్షులు డా. డి. క్రాంతి చైతన్య, కార్యనిర్వాహక అధ్యక్షులు డా. ఎం. శ్రీకాంత్, నంది బాలోత్సవాల ప్రధాన కార్యదర్శి ఎం. గురుస్వామిలు తెలిపారు. శుక్రవారం నంద్యాల న్యూక్లియస్ కాలేజ్ తృతీయ నంది బాలోత్సవాల బ్రోచర్లను నంది బాలోత్సవం ఆహ్వాన కమిటీ అధ్యక్షులు డాక్టర్.క్రాంతి చైతన్య కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఎం గురుస్వామీ న్యూక్లియస్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ఎస్. మురళీదర్ రెడ్డి తదితరుల చేతుల మీదుగా అవిష్కరించారుఈ కార్యక్రమంలో నంది విజ్ఞాన కేంద్రం కన్వీనర్ మౌలాలి, జిల్లా నాయకులు పి.వి.ప్రసాద్, పి.గోపాల్,రమణ,ఖాజా,చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ నేతాజి సుభాష్ చంద్రబోస్ సేవలు చిరస్మరణీయం.

**డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి. -డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్.**

**సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.**



**ఆంధ్ర ప్రగతి డోన్ జనవరి 23:** న స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ నేతాజి సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగాడోన్ పట్టణంలో క్లబ్ హౌస్ నందు డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ అధ్యక్షతన సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో ముఖ్య అతిధిగా డోన్ శాసనసభ్యులు శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి హాజరై శ్రీ నేతాజి సుభాష్ చంద్రబోస్ గారి జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళ్ళు అర్పించారు. వారిని స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి, డోన్ మున్సిపల్ టిఎంసి కె. సుజాత మాట్లాడుతూ బ్రిటీష్ కబంధ హస్తాల నుంచి మాతృభూమిని విముక్తం చేసే దిశగా భారత స్వరాజ్య సంగ్రామంలో నేతాజీ పోషించిన పాత్రకు యావత్ మన భారత జాతి వారికి రుణపడి ఉందని డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ అన్నారు. మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి,డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్,సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు

# రోడ్డు రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యం అవినీతి వల్లే ప్రమాదాలు.

**రోడ్ సేఫ్టీ మర్చి టోల్గేట్ వసూళ్లు.**

**మృతుల కుటుంబాలకు 50 లక్షలు ఇచ్చి క్షతగాత్రులను ఆదుకోవాలి.**

**సిపిఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు.**

**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల జనవరి 23:**
మండల కేంద్రంలోని శిరివెళ్ల మిట్ట సమీపంలో గల 40వ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాద సంఘటనా స్థలాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగ నాయుడు, జిల్లా జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ సిరివెళ్ల మండల సిపిఐ కార్యదర్శి మధు సిపిఐ జిల్లా సమితి సభ్యులు బి.నారాయణ తదితరులు తదితరులు పరిశీలించారు. అనంతరం వారు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ బస్సు ఓనరు ప్రొద్దుటూరు అయితే రిజిస్టర్ ఇతర రాష్ట్రాల్లో జరిగిందని రోడ్డు రవాణా శాఖ అధికారుల అవినీతి నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని రంగ నాయుడు గాటుగా ఆరోపించారు. రోడ్డు సేఫ్టీని




మరిచి కేవలం వాహన తనిఖీలు చలానాలు వేస్తూ వాహనదారులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఫిట్నెస్ లేని వాహనాలను హద్దు అదుపు లేని వేగంతో వెళ్లే వాహనాలను నియంత్రించాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం వల్ల ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని అన్నారు. టోల్ ప్లాజాలలో టోల్గేట్ల రూపంలో కోట్ల రూపాయలు దండుకుంటున్న కాంట్రాక్టర్లు నేషనల్ హైవే అధికారులు రహదారి భద్రతను మరిచారని అన్నారు. అనంతరం 40 వ జాతీయ రహదారిపై జరిగిన సంఘటన స్థలాన్ని పూర్తిగా కాలిపోయిన ట్రావెల్ బస్సును కంటైనర్ను పరిశీలించారు. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా 36 మంది గాయపడ్డారని మృతుల కుటుంబాలకు 50 లక్షలు అందించి తక్షణమే ఆదుకోవాలని క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి ఆర్థిక సహాయం ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని పలు హైవేలపై రాష్ట్ర రహదారులపై ప్రమాదాల నివారణకు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టకపోతే ప్రజా ఉద్యమాలకు తెరలేపుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిపిఐ నాయకులు అనుబంధ సంఘ ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌లో 'ఎ' గ్రేడ్ సాధించాలి.

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జనవరి 23:**
ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలకు సంబంధించి నిర్దేశించిన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ లో ప్రస్తుతం 'బి', 'సి' గ్రేడ్లలో ఉన్న ప్రభుత్వ శాఖలు తమ పనితీరును మరింత మెరుగుపరుచుకుని, లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి 'ఎ' గ్రేడ్ సాధించాల్సిందిగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శాఖల వారీగా నిర్దేశించిన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ప్రగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని శాఖలకు కలిపి కేటాయించిన 312 పారామీటర్లలో ప్రస్తుత గణాంకాల ప్రకారం జిల్లాలో 30 శాఖలు 'బి' గ్రేడ్‌లో, 45 శాఖలు 'సి' గ్రేడ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ శాఖలు సమిష్టిగా కృషి చేసి తమ పనితీరును మెరుగుపరుచుకుని 'ఎ' గ్రేడ్ సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. ప్రస్తుతం




'సి' గ్రేడ్‌లో వ్యవసాయం, ఉద్యాన శాఖ, సెరికల్చర్, రిజిస్ట్రేషన్, ఫిషరీస్, ఫారెస్ట్, స్కూల్ ఎడ్యుకేషన్, మెడికల్ అండ్ హెల్త్, పోలీస్ శాఖలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే 'బి' గ్రేడ్‌లో ఆర్ అండ్ బి, హౌసింగ్, ఇండస్ట్రీస్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయతీరాజ్ తదితర శాఖలు ఉన్నాయని తెలిపారు. ఈ శాఖలు తమ గ్రేడింగ్‌ను మెరుగుపరుచుకునేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా స్థూల ఉత్పత్తికి సంబంధించిన కీలక ఆర్థిక సూచీలపై సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ సూచీల ఆధారంగానే జిల్లా అభివృద్ధి స్థాయిని అంచనా వేయబడుతుందని కలెక్టర్ గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల



అమలులో తక్కువ శాతం నమోదైన విభాగాల్లో లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. డేటా ఎంట్రీ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా, ప్రతి నెలా 5వ తేదీ లోపు సంబంధిత హెచ్ఓడీలు స్వయంగా డేటాను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఓ ఓబులేషు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా శక్తికి ఐద్వా చిరునామా కావాలి !

**జనవరి 23ఆంధ్ర ప్రగతి**
మహిళలు అన్ని రంగాల్లో విప్లవం, విజయాలు సాధిస్తున్నా ఇంకా ఎక్కడో లోటు కనిపిస్తూనే ఉంది. నేటికీ మహిళలు భారతదేశంలో స్వేచ్ఛగా తిరగలేని దుస్థితలోనే ఉన్నారు. ధైర్యంగా ఒంటరిగా వెళ్లలేని పరిస్థితులు నేటికీ ఉన్నాయి. బట్టల విషయంలో ఇటీవల నటుడు శివాజీ చేసిన ఓ వ్యాఖ్యపై రచ్చ చేశారే తప్ప..అందులో నిజమెంత అన్నది మహిళలే ఆలోచించలేకపోయారు. అంగాంగ ప్రదర్శన, కురచ బట్టలు, అర్థనగ్న ప్రదర్శన వంటివన్నీ ఏ స్వేచ్ఛ కిందకు వస్తాయో చెప్పాలి. యత్ర నార్యంతు పూజ్యతే....అన్న నానుడిని తుంగలో తొక్కాం. ప్రధానంగా మృగసామ్రాజ్యం ఇంకా నడుస్తోంది. ఈ సమాజం మారాలంటే ఇంకొంత కాలం పడుతుంది. అందుకు మనమంతా పోరాడాలి. మహిళలను, చిన్నపిల్లలను గౌరవించే దాకా పోరాడాలి. వారికి రక్షణ కల్పించే వరకు పోరాడాలి. వారు స్వేచ్ఛగా తిరగగలిగే పరిస్థితులు వచ్చే వరకు పోరాడాలి. ఇవన్నీ కూడా సమిష్టి పోరాటాలతోనే సాధ్యం అవుతాయి. పనిప్రదేశాలు, ఉద్యోగాలు, బస్సులు, రైళ్లు, రాజకీయ పార్టీలు, సినిమాలు.. విద్యారంగం..ఇలా ఒక్కటేమిటి అన్ని చోట్లా మృగాళ్ల పెత్తనమే తప్ప ఆడ పెత్తనం కానరావడం లేదు. నేటి పాలనలో మహిళలు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. పోరాడి సాధించుకున్న హక్కులన్నీ కాలరాయబడుతున్నాయి. పాలనారంగంలో మహిళలు అక్కడక్కడా ఉంటున్నా న్యాయం దక్కడం లేదు. మమతా బెనర్జీ లాంటి మహిళ పాలనలో ఉన్న బెంగాల్లో కూడా నిత్యం అత్యాచారాలు సాగుతున్నాయి. ఇలాంటి వాటిపై మమతా బెనర్జీ పోరాడడం లేదు. తన పాలనలో మహిళలను సురక్షితంగా ఉన్నారని ధైర్యంగా చెప్పలేక పోతున్నారు. అంటే మహిళలకు అధికారం అప్పగించినా దానిని సరిగా వినియోగించడం లేదని సగటు మహిళ అర్థం చేసుకోవాలి. ఎంత ఎదిగినా పురుషాధిక్యం పోవడం లేదు. ఎందుకనే కారణాలను వెతకాలి. వాటిపై పోరాడాలి. స్త్రీలను మళ్లీ ఇంటికే, వంటింటికే పరిమితం చేసే ఆలోచన




నుంచి బయటపటడం లేదు. లైంగిక దాడులకు గురిచేస్తున్నారు. రక్షణ కరువైన సమాజంలో బతుకుతున్నారు. ఇటువంటి నేపథ్యంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా అఖిల భారత మహాసభలు ఈ నెల 25 నుండి పోరాటాల గడ్డ తెలంగాణలో జరగబోతున్నాయి. తన భవిష్యత్ కర్తవ్యాలు రూపొందించుకోబోతున్న ఈ సభల సందర్భంగా ఐద్వా ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఎంతసేపు మనువాదం అంటూ తిట్టి పోసుకోవడం మానాలి. అసలు మనువాదం అంటే ఈ సమాజానికి తెలియదు. తెలిసిందల్లా ఆడవాళ్లను అణచివేయడం. దీనిపై ఐద్వా చర్చించాలి. అన్నింటికన్నా ముందు.. మహిళలను ఐద్వా గొడుగు కిందకు తీసుకుని వచ్చి ఉద్యమించాలి. ఇదేదో లెఫ్ట్ పార్టీల మహిళా సంఘం అన్న భావన నుంచి బయటపడేయాలి. హైదరాబాద్ నగరంలో ఐద్వా ఆలిండియా మహాసభలు జరగబోతున్న వేళ...ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించాలి. అంటే మహిళా సమాజం ఎదుర్కొంటున్న సమయలను చర్చించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ మహాసభలకు అత్యంత ప్రాధాన్యం వుంది. ఇప్పుడు మహిళా లోకానికి చాలా అవసరమైన సూచనలు, సలహాలు చేయాల్సిన అవసరం ఐద్వాపై ఎక్కువగా ఉంది. మహిళల్లోనూ కులువివక్ష ఉంది. వర్ణ వివక్ష ఉంది. మహిళలంతా ఒక్కటే అన్న భావన నేటికీ రాలేదు. అందుకే మహిళల గొంతు ఇంకా బలంగా వినిపించాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇంట్లోనే కాదు సమాజంలో కూడా కలసికట్టుగా నినదించే స్థాయికి రావాలి. అంతా కలిసి ఐక్యంగా ఉండేందుకు అవగాహన పెంచుకోవడమే కాకుండా, సమస్యలపై పోరాడే శక్తి ఉందని నిరూపించాలి. ఈ మహాసభలు అలాంటి ఉత్సాహాన్ని ఇస్తాయని సగటు మహిళకు ధైర్యం ఇచ్చేలా చేయాలి. ఎందుకంటే దేశ వ్యాప్తంగా అనేక అంశాలపై ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర ఐద్వాకు ఉంది. అసంఘటిత రంగంలో స్త్రీలు

ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. అవన్నీ ప్రేరణగా ముందుకు సాగాల్సిన గురుతర బాధ్యత ఐద్వా మీద ఉంది. ఎందుకంటే సోషల్ మీడియా పెరిగిన తర్వాత మహిళల హక్కులు దుర్వినియోగం అవుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఐద్వా బాధ్యత తీసుకోవాలి. మహిళలను అశ్లీలంగా చూపే సినిమా సన్నివేశాలపై పోరాడాలి. సోషల్ మీడియాలో స్త్రీ వ్యక్తిత్వ హననం జరగకుండా నిలబడాలి. సమస్య ఏదైనా ఐద్వా పోరాడుతుందన్న సందేశం రావాలి. ఎందుకంటే వివిధ రంగాల్లో ఉన్న మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. తమ తరపున మాట్లాడే వాళ్లు లేక చాలా మంది మహిళలు ఒంటరిగా బాధపడుతున్నారు. అలాంటి వారికి ఐద్వా గొంతుక కావాలి. ఎంత పురోగతి సాధించినా మహిళలంటే సమాజంలో చిన్నచూపు ఉంది. ముఖ్యంగా కుటుంబ వ్యవస్థలో మార్పు రావాల్సిన అవరసం ఉంది. అలాగే నేడు కులాలు, మతాల పేర మనుషులను చీల్చుతున్నారు. అందులో మహిళలు ఎక్కువగా బలైపోతున్నారు. కనుక ప్రస్తుత పరిస్థితుల్లో ఐద్వా కృషి మరింత పెరగాల్సిన అవసరం ఉంది. తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతో మంది రైతు మహిళలు తుపాకీ చేతబట్టి పోరాడటమే గాకుండా, అలనాటి వర్గ పోరాటాల్లో ముందు నిలిచిన వీరనారి ఐలమ్మలను కన్న నేల ఇది. సమాజం విముక్తితోనే స్త్రీ విముక్తి ముడిబడి ఉందన్న లక్ష్యం రావాలి. మహిళను ఇంకా వంటిమనిషిగా, విలాసవస్తువుగా చూసే దౌర్భాగ్యం పోవాలంటే ఐద్వా పోరాటాలు మరింత పదునుదేలాలి. 33 శాతం మహిళ రాజకీయ రిజర్వేషన్లు హక్కుగా తక్షణం అమల్లోకి వచ్చేలా పోరాడాలి. పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యం, ప్రాధాన్యం పెరగాలి. అందుకోసం పోరాటం చేయాలి. కేవలం చదువుకున్న కార్పోరేట్ మహిళలకు అధికారం వస్తే సరికాదు...నిమ్న, బడుగు బలహీన వర్గాల మహిళల చేతికి అధికారం దక్కాలి. సామాజిక న్యాయ పోరాటాంలోనూ మహిళల ఐక్యతను బలంగా చాటాలి. స్త్రీని వంటగదికి, సంతాన ఉత్పత్తికి, పురుషునికి సేవ చేసే సేవకురాలిగా పరిమితం చేయాలని చూస్తున్న ఈ సమాజంపై తిరుగుబాటు రావాలి. అభ్యుదయ ఆలోచనలతో ప్రజా ఉద్యమాలు నిర్మించవలసిన అవసరం ఉన్నదని గుర్తించి ఐద్వా విస్తృతంగా తన పరిధిని పెంచుకుని ప్రతి మహిళకు గొడుగు కావాలని ఆశిద్దాం.

---------------

## అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటాం

**- టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్.**





**ఆంధ్రప్రగతి నంద్యాల, జనవరి 23:**
నంద్యాల పట్టణంలోని జీవి మాల్ పక్కన గల కార్పెంటర్ షాపులో నిన్న అర్ధరాత్రి జరిగిన భారీ అగ్నిప్రమాదం అత్యంత దురదృష్టకరమని నంద్యాల తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం ఆయన ప్రమాద స్థలాన్ని సందర్శించి, కాలిబూడిదైన షాపును పరిశీలించారు. బాధితులతో మాట్లాడి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ అర్ధరాత్రి వేళ ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో షాపులోని విలువైన కలప, ఫర్నీచర్ మరియు యంత్రాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, దీనివల్ల సదరు కార్మికుడు తన జీవనోపాధిని కోల్పోవడం బాధాకరమన్నారు . అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుడినికి అండగా ఉంటామన్నారు. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగకుండా వ్యాపారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు బాధితులు పాల్గొన్నారు.

## యువనేత మంత్రి నారా లోకేష్ కు జన్మదినం శుభాకాంక్షలు.

**38 వార్డు టిడిపి ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 23:**
ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కు జన్మదినం శుభాకాంక్షలు సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమమే లక్ష్యంగా, పార్టీ బలోపేతమే ధ్యేయంగా ఆహర్నిశలు కృషి చేస్తున్న యువ నాయకుడు రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ కు శుభాకాంక్షలు తెలిపారు. యువ నాయకత్వానికి ప్రతీకగా, స్పష్టమైన విజన్'తో ప్రజాసేవలో అంకితభావంతో ముందుకు సాగుతున్న నారా లోకేశ్ నాయకత్వం మరింత బలపడాలని ఆయన ఆకాంక్షించారు. పార్టీ బలోపేతం, ప్రజాసంక్షేమం మరియు రాష్ట్ర అభివృద్ధి దిశగా వారు చేపడుతున్న కార్యక్రమాలు మరింత విజయవంతమవాలని, వారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని ఆయన పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్ ఆయురారోగ్యాలు, విజయ లతో నిరంతరం వర్ధిల్లాలని ప్రార్థిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.



## పశు వైద్య శిబిరాలతో రైతులకు ప్రయోజనం.



**ఆంధ్ర ప్రగతి మహానంది జనవరి 23:**పాడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.శుక్రవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని పశు వైద్య కేంద్రం వద్ద డాక్టర్ శివానంద్ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన, ఉచిత పశు వైద్య శిబిరాలను ప్రారంభించారు. పశు వైద్యులు డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ..పశువుల ఉత్పాదకతను పెంచే లక్ష్యంగా పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పశువైద్య శిబిరాలను ప్రతి రైతు వినియోగించుకోవాలని కోరారు.ఈ వైద్య శిబిరంలో పశువులకు నట్టల నివారణ,గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలను వేసి, ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం పాడి రైతులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు చంద్రమోహన్, వెంకటసుబ్బారెడ్డి, గోపవరం సొసైటీ చైర్మన్ గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి, అటవీ శాఖ అధికారులు విజయ్ వర్ధన్, మద్దిలేటి స్వామి, పశు వైద్య సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు మాట్లాడితేనే ఉద్యోగం నిబంధన రావాలి

**మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

గుంటూరు, **జనవరి 23ఆంధ్ర ప్రగతి**తెలుగులో మాట్లాడితేనే ప్రభుత్వ ఉద్యోగం అనే ఉత్తర్వులు తీసుకురావాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. అప్పుడే అందరూ మాతృభాషను గౌరవిస్తారని చెప్పారు. ప్రభుత్వం విద్య, వైద్యం ఉచితంగా అందించాలన్నారు. శుక్రవారం మంగళగిరిలో పర్యటించిన ఆయన.. మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్‌తో కలిసి ఎన్నారై ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం నూతన భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. తెలుగు భాష కోసం కృషి చేసిన వారిని కొనియాడారు.రామోజీరావు ఈనాడు పత్రిక ద్వారా తెలుగు భాష కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. అందుకోసం ఆయన రెండు నిఘంటువులను రూపొందించినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో సాంకేతిక విద్యను మాతృభాషలో అందిస్తారని చెప్పారు. అంతేకాదు వైద్యులు రోగులతో ఆప్యాయంగా మాట్లాడాలన్నారు. వారికి సమయం కేటాయించి అవసరమైతేనే స్కానింగ్, ఇతర పరీక్షలు చేయాలని సూచించారు. తన తల్లి కోరిక మేరకు తాను న్యాయవాది అయినట్లు ఈ సందర్భంగా చెప్పారు. పీపీపీ విధానంలో ఎలాంటి తప్పులు లేవని,. ఇది చాలా మంచి పద్ధతి అని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. ఇందులో ఎలాంటి లోపాలు లేవన్నారు. ప్రైవేటు వైద్య కళాశాలలు వస్తేనే ఎక్కువ మంది వైద్యులు అందుబాటులోకి వస్తారని చెప్పారు.

# కడపలో వైభవంగా ప్రారంభమైన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల తబ్లిగ్ ఏ ఇస్తేమా.

**జుమ్మా ప్రార్థనలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్.**

**ముఖ్య అతిథులుగా హాజరైన మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.**





**ఆంధ్ర ప్రగతి కడప, జనవరి 23:**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల స్థాయి మూడు రోజుల 'దీన్-ఏ-తబ్లిగ్' ఇస్తేమా కడప నగర శివార్లలోని కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్ నందు ఈరోజు (శుక్రవారం) మధ్యాహ్నం అత్యంత ఘనంగా ప్రారంభమైంది. పవిత్ర జుమ్మా ప్రార్థనలతో ప్రారంభమైన ఈ ఆధ్యాత్మిక సదస్సుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి లక్షలాది మంది ముస్లిం సోదరులు, ఇస్లామిక్ పండితులు తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం మరియు ఆధ్యాత్మిక చింతన పెంచడంలో ఇస్తేమా వంటి సదస్సులు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఇక్కడికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.
నంద్యాల తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ఇస్తేమా నిర్వహణ కోసం తీసుకున్న చర్యలను, కల్పించిన వసతులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన మత పెద్దలు మరియు భారీ సంఖ్యలో స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు. రాబోయే మూడు రోజుల పాటు ఈ వేదికపై ప్రముఖ ఇస్లామిక్



పండితులచే ధార్మిక ప్రసంగాలు, సామూహిక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఆదివారం మధ్యాహ్నం జరిగే 'దువా' (ప్రత్యేక ప్రార్థన)తో ఈ ఇస్తేమా ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# నంద్యాలలో ఘనంగా మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు.

**పేద విద్యార్థులకు స్కూల్ కిట్లు, పుస్తకాలు పంపిణీ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జనవరి 13:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ గారి 43వ జన్మదిన వేడుకలు నంద్యాలలో అత్యంత ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ పాల్గొన్నారు. నారా లోకేష్ గారి పుట్టినరోజును పురస్కరించుకుని, సామాజిక సేవా దృక్పథంతో పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు మరియు స్కూల్ కిట్లను మంత్రి ఎన్ఎండి ఫరూక్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ కలిసి పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతి కోసం, యువత భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న యువ నాయకుడు నారా లోకేష్ గారు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. విద్యార్థుల చదువుపై లోకేష్ గారికి ఉన్న మక్కువను దృష్టిలో ఉంచుకుని, వారి పుట్టినరోజున పేద విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేయడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో లోకేష్ గారు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీమ ఎత్తిపోతలతోనే సమస్యకు పరిష్కారం

**శాశ్వత నీటి సౌకర్యం కల్పించాలన్న డిమాండ్**



తిరుపతి, **జనవరి 23ఆంధ్ర ప్రగతి**
రాయలసీమకు నీటి హక్కు కల్పించాలనే సంకల్పంతో సాగిన పోతిరెడ్డిపాడు పాదయాత్రకు 40 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా రాయలసీమకు శాశ్వత నీటి సౌకర్యం కల్పించాలని ‑రాయలసీమ ఎత్తిపోతల పథక సాధన సమితి డిమాండ్ చేసింది. ఇందుకోసం రాయలసీమ ఎత్తిపోతల సాధన సమితిని ఏర్పాటు చేసి, రాయలసీమ అవసరాల కోసం హక్కుగా అందాల్సిన నీటిని సాధించే దిశగా ఉద్యమించాలని నిర్ణయించింది. రాయలసీమ నీటి సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, భవిష్యత్తు విధానాలపై సార్థకమైన చర్చకు వేదిక కల్పించాలని తదితర అంశాలను ఇటీవలి సమావేశంలో ఆమోదించారు. 40 ఏళ్ల అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఇటీవల తిరుపతిలో చర్చాగోష్టి నిర్వహించారు. ఈ గోష్టిలో పలు రాజకీయపార్టీలకు చెందిన నాయకులు, సామాజిక మేధావులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలుపుదలపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. రాయలసీమ డిక్లరేషన్‌పై బిజెపి మౌనం వహించడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. 2023లో తాగునీటి అవసరాల కోసం జగన్ హయాంలో రూ.3285 కోట్లు అంచనా వ్యయంతో పనులు ప్రారంభిస్తే ఇందులో రూ.1000 కోట్లు ఖర్చు చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిపివేసిందన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై సిఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని, దీనిపై తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి రాయలసీమకు మేలు జరిగే విధంగా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రులు వారి రాజకీయ లబ్దికోసం రాయలసీమ ప్రాంత ప్రజలకు తీరని ద్రోహం, అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఈ క్రమంలోనే ‑రాయలసీమ ఎత్తిపోతల సాధన సమితి ఏర్పాటుకు తీర్మానం చేశారు. ఇందులో వైకాపా, సిపిఎం తదితర పార్టీల నేతలు పాల్గొన్నారు.

# చంద్రబాబు పేషీ పేరుతో మోసాలు.. ఇద్దరి అరెస్ట్

**డీఎస్సీలో ఎస్జీటీ పోస్టు ఇప్పిస్తామని రూ.12 లక్షలు వసూలు**
**అనకాపల్లి జిల్లాలో ఇద్దరు నిందితుల అరెస్ట్**
**ప్రధాన నిందితుడు శ్రీనుపై గతంలోనూ చీటింగ్ కేసులు**
**డబ్బులిస్తే ఉద్యోగాలొస్తాయని నమ్మొద్దన్న ఎస్పీ**

**జనవరి 23ఆంధ్ర ప్రగతి**
ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో అమాయకులను మోసం చేస్తున్న ముఠాలు పేట్రేగిపోతున్నాయి. ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పేషీ పేరునే వాడుకుంటూ లక్షలు దండుకుంటున్న ఉదంతం తాజాగా అనకాపల్లి జిల్లాలో వెలుగుచూసింది. డీఎస్సీలో ఎస్జీటీ పోస్టు ఇప్పిస్తామని నమ్మించి ఓ మహిళ నుంచి రూ.12 లక్షలకు పైగా వసూలు చేసిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రోలుగుంట మండలానికి చెందిన ఓ మహిళకు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం ఇప్పిస్తామని నిందితులు



నమ్మించారు. ప్రధాన నిందితుడు ప్రకాశం జిల్లా నాయుడుపాలెం గ్రామానికి చెందిన ఎర్రగొర్ల శ్రీను కాగా, ఇతనికి విజయవాడకు చెందిన షేక్ సలీం సహకరించాడు. తనకు సీఎం చంద్రబాబు పేషీలో ఉన్నతాధికారులతో సన్నిహిత పరిచయాలు ఉన్నాయని, కచ్చితంగా ఉద్యోగం ఇప్పిస్తానని శ్రీను బాధితురాలిని మభ్యపెట్టాడు. ఇది నమ్మిన సదరు మహిళ నుంచి నిందితులు విడతలవారీగా రూ.12 లక్షలకు పైగా నగదు వసూలు చేసి మోసగించారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ.. ప్రధాన నిందితుడు ఎర్రగొర్ల శ్రీను పాత నేరస్తుడని వెల్లడించారు. గతంలో కూడా ఇతను ఎస్సై, లైన్‌మెన్ ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని మోసం చేసిన చరిత్ర ఉందని తెలిపారు. ఈ కేసులో ఇంకా ఎవరైనా బాధితులు ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎవరైనా ఉద్యోగాల పేరుతో డబ్బులు అడిగితే నమ్మవద్దని, వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ ప్రజలకు సూచించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 24 జనవరి 2026

# బంగ్లాదేశ్ విషయంలో జైషా సంప్రదింపులు



2026 పురుషుల టీ20 ప్రపంచ కప్ కోసం బంగ్లాదేశ్ జట్టు భారత్‌లో పర్యటించకుంటే అంతర్జాతీయ క్రికెట్ మండలి చైర్మన్ జై షా కఠిన చర్యలు తీసుకునే ఆలోచనలో ఉన్నారని ఐసీసీ వర్గాలు తెలిపాయి. ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకునే విషయంపై ఐసీసీ చైర్మన్ దుబాయ్ వేదికగా సంప్రదింపులు జరుపుతున్నట్లు వివరించాయి. బంగ్లాలో హిందువులపై నేరాలు పెరిగిన వేళ బీసీసీఐ సూచనతో ఇటీవల బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ 2026 జట్టు నుంచి కేకేఆర్ తొలగించింది. అప్పటినుంచి భారత్‌పై బీసీబీ అక్కసు పెంచుకుంది. తమ ఆటగాళ్లకు భద్రతాపరమైన సమస్యలు ఉన్నాయనీ టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లను భారత్ వెలుపల శ్రీలంకలో నిర్వహించాలని కోరగా ఐసీసీ ఆ అభ్యర్థనను తిరస్కరించింది. భారత్‌లో బంగ్లా జట్టు, మ్యాచ్ వేదికలకు బీసీబీ చెప్పినట్లు ఎలాంటి ముప్పు గుర్తించలేదని ఐసీసీ పేర్కొంది. ఐసిసి విజ్ఞప్తిని తిరస్కరించిన తర్వాత స్పందించిన బీసీబీ చీఫ్ అమీనుల్ ఇస్లాం భారత్‌లో ఆడలేమని మరోసారి తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో ఐసీసీ చీఫ్ జైషా నిర్ణయం ఏ నిర్ణయం తీసుకుంటారోన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

# రెండో టీ20లో టీమిండియా సూపర్ విక్టరీ...

న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో టీమిండియా అద్భుతమైన విజయాన్ని నమోదు చేసింది. రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఈ పోరులో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (82రి), వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ (76) సృష్టించిన విధ్వంసానికి కివీస్ బౌలర్లు చేతులెత్తేశారు. ప్రత్యర్థి నిర్దేశించిన 209 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ కేవలం 15.2 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఈ గెలుపుతో 5 మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది.అనంతరం 209 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన భారత్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సంజూ శాంసన్ (6), అభిషేక్ శర్మ (0) కేవలం 6 పరుగులకే పెవిలియన్ చేరడంతో జట్టు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ముఖ్యంగా ఇషాన్ కిషన్ తనదైన శైలిలో బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. కేవలం 32 బంతుల్లోనే 11 ఫోర్లు, 4 సిక్సర్ల సహాయంతో 76 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు 122 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పి భారత విజయాన్ని ఖాయం చేశారు.



ఇషాన్ నిష్క్రమణ తర్వాత క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే (18 బంతుల్లో 36 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్సులు) కూడా దూకుడుగా ఆడటంతో భారత్ మరో 28 బంతులు మిగిలి ఉండగానే సునాయాసంగా విజయాన్ని అందుకుంది. చివరి వరకు క్రీజులో నిలిచిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 37 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 82 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కివీస్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ, జాకబ్ డఫ్ఫీ, ఇష్ సోధీ తలో వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు, ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 208 పరుగుల భారీ స్కోరు సాధించింది. కివీస్ ఇన్నింగ్స్‌లో రచిన్ రవీంద్ర (26 బంతుల్లో 44; 2 ఫోర్లు, 4 సిక్సులు) టాప్ స్కోరర్‌గా నిలవగా, ఆఖర్లో కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (27 బంతుల్లో 47 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టు స్కోరును 200 పరుగులు దాటించాడు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 35 పరుగులిచ్చి 2 వికెట్లతో రాణించగా, హార్దిక్ పాండ్యా, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, శివమ్ దూబే తలో వికెట్ పడగొట్టారు.ఇక ఇరుజట్ల మధ్య మూడో టీ20 ఈ నెల 25న గువాహటిలో జరగనుంది.

# భారత్‌కు రాకపోతే బంగ్లాదేశ్‌కు రూ.240 కోట్ల నష్టం!

భారత్ వేదికగా జరిగే ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో పాల్గొనబోమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ)స్పష్టం చేసింది. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని లేదంటే టోర్నీ నుంచి తప్పుకుంటామని తేల్చేసింది. భద్రత కారణాల దృష్ట్యా తమ జట్టును భారత్‌కు పంపే ప్రసక్తే లేదని బీసీబీ ప్రకటించింది. దాంతో బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్ బరిలోకి దిగేందుకు మార్గం సుగుమమైంది. త్వరలోనే ఈ వ్యవహారంపై ఐసీసీ అధికారిక ప్రకటన చేయనుంది. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అనాలోచిత నిర్ణయంతో ఆ దేశ క్రికెట్ మనుగడనే ప్రశ్నార్థకంగా మారింది. బంగ్లాదేశ్ ప్రభుత్వ ఒత్తిడితో తీసుకున్న ఈ నిర్ణయంతో బీసీబీకి భారీ ఆర్థిక నష్టం వాటిల్లనుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ నుంచి బంగ్లాదేశ్ తప్పుకుంటే ఆ దేశ బోర్డు రూ. 240 కోట్ల వరకు నష్టపోయే అవకాశం ఉంది. బంగ్లాదేశ్ కరెన్సీలో ఇది దాదాపు రూ.325 కోట్లతో సమానం. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఐసీసీ సభ్య దేశాలకు ఏటా ఇచ్చే ఆదాయ వాటాలో బంగ్లాదేశ్‌కు రావాల్సిన మొత్తాన్ని నిలిపేసే అవకాశాలు ఉన్నాయి. ఇది ఆదేశ క్రికెట్ బోర్డును స్తంభింపజేసే ప్రమాదం ఉంది.ఐసీసీ నుంచి రావాల్సిన బ్రాడ్ కాస్టింగ్ ఆదాయంలోని వాటాతో పాటు మొత్తం 60 శాతం ఆదాయాన్ని కోల్పోనుంది. ప్రపంచకప్ వంటి పెద్ద టోర్నీలను బహిష్కరిస్తే ఆ జట్టు స్పాన్సర్లు కూడా తప్పుకోనున్నారు. ఇది ఆ దేశ క్రికెట్ బోర్డు ఆర్థిక స్థితిని దెబ్బతీయనుంది.బంగ్లాదేశ్ తాజా నిర్ణయంతో ఆగస్ట్, సెప్టెంబర్‌లో భారత్‌తో జరగాల్సిన ద్వైపాక్షిక సిరీస్ కూడా రద్దు కానుంది. ఈ సిరీస్ ద్వారా బీసీబీకి బ్రాడ్ కాస్టింగ్ రైట్స్ ద్వారా భారీ ఆదాయం సమకూరే అవకాశం ఉండేది. ఇతర జట్లతో 10 మ్యాచ్‌లు ఆడటం ద్వారా వచ్చే ఆదాయం భారత్‌తో జరిగే ఒక సిరీస్‌లోనే లభిస్తుంది. ఇప్పుడు అది కూడా బంగ్లా క్రికెట్ బోర్డు కోల్పోనుంది. బంగ్లాదేశ్ ప్రభుత్వ క్రీడా సలహాదారుడు ఆసిఫ్ నస్రుల్ భారత్‌కు వెళ్లే ప్రసక్తే లేదని స్పష్టం చేశాడు. ఈ విషయమై మాజీ క్రికెటర్లు అతన్ని కలిసినా ప్రయోజనం లేకపోయింది. సీనియర్ ఆటగా÷-ళెవరూ ఈ వ్యవహారంపై మాట్లాడటం లేదు. ముఖ్యంగా తమీమ్ ఇక్బాల్ వంటి గొప్ప ఆటగాళ్లకే గౌరవం దక్కని పరిస్థితుల్లో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మాట్లాడటం సరికాదని వారు భావిస్తున్నారు. ప్రపంచకప్ ఆడకపోయినా.. ఆటగాళ్లక ు మ్యాచ్ ఫీజులు అందజేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. కానీ అంతర్జాతీయ స్థాయిలో ఆడే ఆటగాళ్లకు డబ్బు ఒక్కటే లక్ష్యం కాదు. ప్రపంచ వేదికపై తమ నైపుణ్యాలను నిరూపించుకోవడమే ముఖ్యం. ఈ క్రమంలోనే ప్రభుత్వ నిర్ణయంపై బంగ్లా ఆటగాళ్లు అసంతృప్తిగా ఉన్నారు. రాజకీయ కారణాలతో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తీసుకున్న నిర్ణయం .. ఆ దేశ క్రికెట్‌ను చాలా ఏళ్ల పాటు వెనక్కి నెట్టివేస్తుందని క్రికెట్ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.



# బుమ్రా, అక్షర్ పటేల్ ఆడటం లేదు

- టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్



ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టీ20లో టీమిండియా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. డ్యూ ప్రభావం నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. ఈ మ్యాచ్ నుంచి బుమ్రాకు విశ్రాంతి కల్పించామని చెప్పిన సూర్య.. గాయంతో అక్షర్ పటేల్ దూరమయ్యాడని పేర్కొన్నాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. ఇక్కడ అప్పుడే మంచు కురుస్తోంది. మేం ఈ మధ్య కాలంలో లక్ష్యాన్ని ఛేజ్ చేయలేదు. అందుకే ఇప్పుడు ఛేజింగ్ చేయాలనుకుంటున్నాం. పిచ్ చూడటానికి బాగుంది. మేం ఆడే ప్రతీ మ్యాచ్‌లోనూ.. అన్ని విభాగాల్లో మెరుగవ్వడానికి ప్రయత్నిస్తున్నాం. ఈ మ్యాచ్‌లో కూడా అన్ని రంగాల్లో అలాగే రాణించడానికి ప్రయత్నిస్తాం. మా తుది జట్టులో రెండు మార్పులు జరిగాయి. అక్షర్ పటేల్‌కు గత మ్యాచ్‌లో గాయమైంది. బుమ్రాకు ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతి కల్పిచాం.'అని సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. మరోవైపు టాస్ గెలిస్తే తాము కూడా బౌలింగ్ చేయాలనుకున్నామని న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్ అన్నాడు. 'మేం కూడా ముందుగా బౌలింగ్ చేయాలనుకున్నాం. మైదానంలో అప్పుడే మంచు కురుస్తుంది. పరిస్థితి మాకేమి అంత అనుకూలంగా మారుతుందని నేను అనుకోవడం లేదు. స్వదేశీ పరిస్థితుల్లో ఇలాంటి నాణ్యమైన జట్టుతో ఆడుతున్నప్పుడు, ప్రతీసారి ఎంతో కొంత నేర్చుకోవాల్సి ఉంటుంది. మేం కూడా నేర్చుకున్నాం. ముఖ్యంగా భారత బ్యాటర్లు ఇన్నింగ్స్ మొత్తం బ్యాటింగ్‌తో విరుచుకుపడ్డారు. బౌలింగ్‌లో మేం ఏం చేయాలో ఇప్పుడు మాకు అర్థమైంది. మా ప్రణాళికల విషయంలో మేం మరింత స్పష్టంగా ఉండి, వారిని కట్టడి చేయడానికి ప్రయత్నించాలి. మా జట్టులో మూడు మార్పులు జరిగాయి. రాబర్ట్‌సన్ స్థానంలో సీఫెర్ట్, క్రిస్టియన్ క్లార్క్ స్థానంలో జక్ ఫోల్క్స్, జేమీసన్ స్థానంలో మాట్ హెన్రీ జట్టులోకి వచ్చారు.'అని మిచెల్ సాంట్నర్ చెప్పుకొచ్చాడు.

# రంజీ ట్రోఫీలో సర్ఫరాజ్ ఖాన్ ఐదో డబుల్ సెంచరీ !




ముంబై స్టార్ బ్యాట్స్‌మన్ సర్ఫరాజ్ ఖాన్ మరోసారి భారత దేశీయ క్రికెట్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. స్థిరమైన బ్యాటింగ్‌తో నమ్ముకున్న జట్టు విశ్వాసాన్ని నిలబెట్టాడు. 2025-26 రంజీ ట్రోఫీ ఆరో రౌండ్‌లో హైదరాబాద్‌పై జరిగిన మ్యాచ్‌లో డబుల్ సెంబచరీతో దుమ్మురేపాడు. తన ఆట తీరుతో ముంబైని పటిష్ట స్థితిలో ఉంచాడు. రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ముంబై జట్టు పేలవమైన ఆరంభాన్ని పొందింది. జట్టు 82 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది, ఒత్తిడి స్పష్టంగా ఉంది. ఆ సమయంలో, సర్ఫరాజ్ ఖాన్ బ్యాటింగ్‌కు వచ్చాడు. అతను మొదట తనను తాను సంయమనంతో ఉంచుకున్నాడు, తరువాత తన సహజ దూకుడు ఆటతో పరుగులు సాధించడం ప్రారంభించాడు.మొదటి రోజు ఆట ముగిసే సమయానికి సర్ఫరాజ్ 142 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. రెండో రోజు కూడా అతని బ్యాటింగ్ అదే ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించింది. అతను కేవలం 206 బంతుల్లోనే తన డబుల్ సెంచరీని చేరుకున్నాడు. చివరికి అవుట్ అయ్యే ముందు, సర్ఫరాజ్ 219 బంతుల్లో 19 ఫోర్లు, 9 సిక్సర్లతో సహా 227 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు.సర్ఫరాజ్ ఔటైన తర్వాతే హైదరాబాద్ బౌలర్లకు కొంత ఊరట లభించింది. ఈ ఇన్నింగ్స్‌తో ముంబై జట్టు 560 పరుగులు చేసింది. హైదరాబాద్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన భారత ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌కు ఈ మ్యాచ్ అంతగా మంచిది కాదు. ఈ మ్యాచ్‌లో అతను కేవలం ఒక వికెట్ మాత్రమే తీసుకున్నాడు.దీనితో, సర్ఫరాజ్ ఖాన్ ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో ఐదు డబుల్ సెంచరీలు సాధించాడు. ఈ గణాంకాలు దేశీయ క్రికెట్‌లో అతని స్టామినాను ప్రతిబింబిస్తాయి. ప్రస్తుత రంజీ సీజన్‌లో కూడా అతను అద్భుతంగా రాణించాడు.

## సైనా నెహ్వాల్ ఆట నుంచి తప్పుకోవడంపై సీఎం చంద్రబాబు స్పందన

భారత బ్యాడ్మింటన్ దిగ్గజం సైనా నెహ్వాల్ ఆట నుంచి తప్పుకోవడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. భారత క్రీడా రంగానికి ఆమె చేసిన సేవలను కొనియాడుతూ ఎక్స్ వేదికగా ప్రశంసల జల్లు కురిపించారు. సైనా నెహ్వాల్ సాధించిన విజయాలు దేశానికే గర్వకారణమని చంద్రబాబు పేర్కొన్నారు.“సైనా నెహ్వాల్‌ను చూసి మనమంతా ఎంతో గర్విస్తున్నాం. భారత బ్యాడ్మింటన్ చరిత్రలో ఆమె ఒక సువర్ణాధ్యాయాన్ని లిఖించారు. మన బ్యాడ్మింటన్‌ను ప్రపంచ పటంలో సగర్వంగా నిలిపిన ఘనత ఆమె సొంతం. సైనా కఠోర శ్రమ, పట్టుదల, ఆమె సాధించిన విజయాలు ఒక చెరగని ముద్ర వేశాయి. ఇవి ఎంతోమంది యువ క్రీడాకారులు రాకెట్ పట్టుకుని కోర్టులో అడుగుపెట్టేలా స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. బ్యాడ్మింటన్‌కు మీరు చేసిన సేవలకు ధన్యవాదాలు సైనా. రిటైర్మెంట్ తర్వాత మీరు చేపట్టబోయే పనులు విజయవంతం కావాలని, మీ భవిష్యత్తు బాగుండాలని కోరుకుంటున్నాను“ అని చంద్రబాబు తన సందేశంలో పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా, మోకాలి గాయాల కారణంగా ఇక ఆడలేనంటూ సైనా నెహ్వాల్ పరోక్షంగా బ్యాడ్మింటన్‌కు గుడ్ బై చెప్పడం తెలిసిందే. సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ వంటి క్రీడా దిగ్గజాలు కూడా సైనా సేవలను కొనియాడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. లండన్ ఒలింపిక్స్ లో కాంస్య పతకం సాధించి భారతీయ బ్యాడ్మింటన్ ముఖచిత్రాన్ని మార్చిన సైనా.. తన నిర్ణయంతో అభిమానులను కాస్త నిరాశకు గురిచేసినా, భారత బ్యాడ్మింటన్ రంగంలో ఆమె ఘనమైన వారసత్వం మాత్రం శాశ్వతంగా నిలిచిపోతుంది.



# ఏకంగా 9 గంటల పాటు డబ్బింగ్ చెప్పిన కీర్తి సురేశ్



జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ నటి కీర్తి సురేశ్ తన డెడికేషన్‌తో మరోసారి అభిమానులను ఆకట్టుకుంది. తాజాగా ఒక సినిమా కోసం ఏకంగా 9 గంటల పాటు డబ్బింగ్ చెప్పినట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. డబ్బింగ్ స్టూడియోలో కాస్త అలసిపోయినట్లుగా ఉన్న ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పంచుకుంటూ.. "9 గంటల డబ్బింగ్ తర్వాత నా పరిస్థితి ఇది" అని పేర్కొంది. ఈ పోస్ట్ ఆమె పని పట్ల చూపే నిబద్ధతను తెలియజేస్తోంది.తన పాత్రలకు తానే సొంతంగా డబ్బింగ్ చెప్పుకోవడం కీర్తి సురేశ్ ప్రత్యేకత. 'మహానటి' చిత్రంలో సావిత్రి పాత్రకు తమిళం, తెలుగు భాషల్లో ఆమె చెప్పిన డబ్బింగ్ సినిమాకు ప్రాణం పోసి, జాతీయ అవార్డును సాధించిపెట్టింది. ఇటీవల వచ్చిన 'కల్కి 2898 ఏడీ'లో 'బుజ్జి' అనే ఏఐ క్యారెక్టర్‌కు ఏకంగా 5 భాషల్లో వాయిస్ అందించి తన విలక్షణతను చాటుకుంది. ఆమె వాయిస్ మాడ్యులేషన్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది.ప్రస్తుతం కీర్తి సురేశ్ చేతిలో పలు భాషల్లో భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. తెలుగులో విజయ్ దేవరకొండ సరసన 'రౌడీ జనార్ధన' చిత్రంలో నటిస్తోంది. తమిళంలో ఓ సినిమాలో లాయర్ పాత్ర పోషిస్తుండగా, హిందీలో 'అక్కా' అనే రివెంజ్ థ్రిల్లర్ సిరీస్‌లో కనిపించనుంది.ఇక మలయాళంలో నటిస్తున్న 'తొట్టం' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇది యాక్షన్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతుండగా, ఇందులో కీర్తి మునుపెన్నడూ చూడని యాక్షన్ అవతార్‌లో కనిపించనుందని సమాచారం. 'ది రైడ్' వంటి అంతర్జాతీయ యాక్షన్ చిత్రాలకు పనిచేసిన వీ యాక్షన్ డిజైన్ టీమ్ ఈ చిత్రానికి స్టంట్స్ అందిస్తుండటం విశేషం. 'యానిమల్' ఫేమ్ హర్షవర్ధన్ రామేశ్వర్ దీనికి సంగీతం సమకూరుస్తున్నారు.



# లోకేశ్ కు ఎన్టీఆర్ విషెస్

టీడీపీ జనరల్ సెక్రటరీ, మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా ఆయనకు సినీ, రాజకీయ ప్రముఖుల నుంచి పుట్టినరోజు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. లోకేశ్ బావ, సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ కూడా బర్త్ డే విషెస్ తెలిపారు. ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. "పుట్టిన రోజు శుభాకాంక్షలు నారా లోకేశ్. ఈ ఏడాది మీకు మరో అద్భుతమైన సంవత్సరం కావాలని ఆకాంక్షిస్తున్నా" అని ట్వీట్ చేశారు.



## మెగా ఫ్యాన్స్‌కు ట్రీట్..

# 'శశిరేఖ' వీడియో సాంగ్


మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు' నుంచి ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'శశిరేఖ' ఫుల్ వీడియో సాంగ్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. సంక్రాంతికి వచ్చి బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించిన ఈ సినిమా నుంచి విడుదలైన ఈ మెలోడీ సాంగ్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.ఈ పాటలో మెగాస్టార్ చిరంజీవి, లేడీ సూపర్ స్టార్ నయనతార మధ్య కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం, అనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం పాటకు ప్రాణం పోశాయి. భీమ్స్, మధుప్రియ ఆలపించిన ఈ గీతానికి భాను మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతున్న నేపథ్యంలో ఈ ఫుల్ వీడియో సాంగ్ విడుదల మెగా అభిమానులకు మంచి ట్రీట్ అని చెప్పాలి.

# పెద్దిలో మృణాల్ స్పెషల్ సాంగ్

'సీతా రామం' సినిమాతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న నటి మృణాల్ ఠాకూర్, ఇప్పుడు ఓ భారీ చిత్రంలో ప్రత్యేక గీతంలో అలరించనున్నారనే వార్తలు ఫిల్మ్‌నగర్‌లో చక్కర్లు కొడుతున్నాయి. మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది'లో ఆమె ఓ ఐటెం సాంగ్‌లో నటించనున్నట్లు తెలుస్తోంది.

ఈ పాట కోసం చిత్ర నిర్మాతలు ఇప్పటికే మృణాల్‌ను సంప్రదించారని, ఇది ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా ప్రాజెక్ట్ కావడంతో ఆమె వెంటనే అంగీకరించినట్లు సమాచారం. ఈ ప్రత్యేక గీతాన్ని భారీ హంగులతో, అద్భుతమైన సెట్‌లో చిత్రీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పాట కోసం సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ ఇప్పటికే ఓ హుషారైన ట్యూన్‌ను సిద్ధం చేశారని ఇండస్ట్రీ వర్గాలు చెప్పుకుంటున్నాయి.ఇటీవలి కాలంలో అగ్ర కథానాయికలు ప్రత్యేక గీతాల్లో నటించడం ఒక ట్రెండ్‌గా మారింది. తక్కువ రోజుల కాల్షీట్లకు భారీ పారితోషికం లభించడంతో పాటు, యువతలో ఇలాంటి పాటలకు ఉన్న క్రేజ్ దృష్ట్యా స్టార్ హీరోయిన్లు ఐటెం సాంగ్స్‌కు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మృణాల్ హిందీ, తెలుగు భాషల్లో పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. అల్లు అర్జున్-అట్లీ కాంబినేషన్‌లో రానున్న పాన్ వరల్డ్ చిత్రంలో కూడా ఆమె ఓ కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే.





## ఎట్టకేలకు విడుదలవుతున్న

# అనుపమ పరమేశ్వరన్ 'లాక్ డౌన్'

యువ కథానాయిక అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన ఎమోషనల్ డ్రామా 'లాక్‌డౌన్' విడుదలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఏఆర్ జీవా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం జనవరి 30న థియేటర్లలో విడుదల కానుందని నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు "ప్రతి విరామానికి ఒక అర్థం ఉంటుంది.. జనవరి 30న లాక్‌డౌన్ చిత్రం థియేటర్లలోకి వస్తోంది" అంటూ చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది.వాస్తవానికి ఈ సినిమా గత ఏడాది డిసెంబర్ 5నే విడుదల కావాల్సి ఉండగా, చెన్నైతో పాటు తమిళనాడులోని పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలు, 'దిత్వా' తుపాను ప్రభావం కారణంగా వాయిదా పడింది. ఆ తర్వాత డిసెంబర్ 12న విడుదల చేయాలని భావించినప్పటికీ, అనివార్య కారణాల వల్ల అది కూడా సాధ్యపడలేదు. ప్రేక్షకుల భద్రత తమకు ముఖ్యమని పేర్కొంటూ అప్పట్లో లైకా సంస్థ సినిమాను వాయిదా వేసింది. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలించడంతో ఈ నెలాఖరున సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో అనుపమ 'అనిత' అనే పాత్రలో కనిపిస్తుంది. కరోనా లాక్‌డౌన్ సమయంలో ఇంట్లో ఇబ్బందులు పడుతూ, బయట అప్పుల కోసం ప్రయత్నించే ఓ యువతి కథగా ట్రైలర్ ఆసక్తిని రేకెత్తిస్తోంది. చార్లీ, నిరోషా, లివింగ్‌స్టన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఎన్ఆర్ రఘునందన్, సిద్ధార్థ్ విపిన్ సంగీతం అందించగా, ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు ఇప్పటికే 'యూ/ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. లేడీ ఓరియెంటెడ్ కథాంశంతో వస్తున్న ఈ చిత్రంపై మంచి అంచనాలు నెలకొన్నాయి.

# మార్చి తొలి వారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ?



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్ర పాలనా వ్యవహారాల్లో బిజీగా ఉంటూనే... తన సినీ ప్రయాణాన్ని కూడా కొనసాగిస్తున్నారు. 'ఓజీ' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న పవర్ స్టార్ ప్రస్తుతం హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో బిజీగా ఉన్నారు. ఈ సినిమాను సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.ఈ సినిమా తర్వాత పవన్ కల్యాణ్ దర్శకుడు సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో మరో భారీ ప్రాజెక్ట్ లైనప్‌లో ఉంది. ఈ చిత్రాన్ని 'జైత్ర రామ మూవీస్' బ్యానర్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తుండగా, వక్కంతం వంశీ కథను అందిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై పవన్ ఫ్యాన్స్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన అప్డేట్ సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం అవుతోంది. మార్చి తొలి వారం నుంచే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ను ప్రారంభించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారనే టాక్ వినిపిస్తోంది. అయితే, దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.